



ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

భారత రాజ్యాంగం 75వ దినోత్సవాన్ని మంగళవారం జిల్లా అంతటా ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి కలెక్టర్ విజయకృష్ణన్ పూలమాల వేసి నివాళులు అర్పించారు.

రోడ్లపైనే వ్యాపారాలు

అనకాపల్లిలో రహదారులు, ఫుట్‌పాత్‌లు ఇష్టారాజ్యంగా ఆక్రమణ

- కుంచించుకుపోతున్న రోడ్లు
- పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలుపుదల
- రద్దీ సమయంలో ట్రాఫిక్ సమస్య
- పట్టించుకోని పోలీసు, జీవీఎంసీ అధికారులు
- అవస్థలు పడుతున్న పాదచారులు, వాహనదారులు



బండిగారి వీధిలో రోడ్డుపై వాహనాలు నిలిపి అన్‌లోడింగ్ చేయిస్తున్న వ్యాపారులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లా కేంద్రంలో ప్రధాన రహదారులు ఆక్రమణకు గురవుతున్నాయి. అనకాపల్లి పట్టణంలో పలు రోడ్లను పెద్ద వ్యాపారులతో పాటు చిరు వ్యాపారాలు కూడా ఆక్రమించేయడంతో ట్రాఫిక్ సమస్య నానాటికీ జటిలం అవుతున్నది. జీవీఎంసీ అధికారులు, పోలీసులు పట్టించుకోకపోవడంతో పాదచారులు, వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పట్టణంలో ప్రధాన రహదారి అయిన నెహ్రూచౌక్ నుంచి పెరుగుబజారు జంక్షన్ మీదుగా రింగ్ రోడ్డు వరకు గత ఎన్నికల ముందు సుమారు రూ.2 కోట్లు ఖర్చు చేసి హడావుడిగా విస్తరణతో పాటు పలు అభి వృద్ధి పనులు చేపట్టారు. కానీ గతానికి, ప్రస్తు తానికి పరిస్థితిలో ఎటువంటి మార్పు లేదని స్థానికులు పెదవి విరుస్తున్నారు. ఇరువైపులా తోపుడు బండ్లు, వాహనాల నిలు దలతో రోడ్డు ఇరుకుగా మారింది. జిల్లా కేంద్రం కావడంతో అనకాపల్లికి వివిధ ప్రాంతాల నుంచి ప్రజల రాకపోకలు పెరుగుతున్నాయి. వ్యాపార సం స్థలు వి స్తరిస్తున్నాయి. దీంతో అభివృద్ధితోపాటు ట్రాఫిక్ సమస్యలూ పెరిగిపోతున్నాయి. ఎన్టీఆర్ స్టేడియం నుంచి పెరుగుబజారు, రింగ్‌రోడ్డు కూడలి మీదుగా బంగ్లా జంక్షన్ వరకు పెద్ద పెద్ద డివైడర్లు ఏర్పాటు చేయడంతో మెయిన్ రోడ్డు వెడల్పు తగ్గిపోయింది. దీంతో పలువురు వ్యాపారులు ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు సాగి స్తున్నారు. ఆయా దుకాణాల్లో కొనుగోళ్ల నిమిత్తం వచ్చే వారు తమ వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేస్తున్నారు. మరోవైపు పకోడి, చాట్ బండ్లు, కూరగాయలు, వస్త్ర వ్యాపారులు రోడ్లను, ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకొని కార్యకలపాలు సాగిస్తున్నారు. వేల్పుల వీధి మదుము, సత్య థియేటర్, కన్యకాపరమేశ్వరి ఆలయం కూడలి, చిన నాలుగు రోడ్ల కూడలి, కుంచావారి వీధి, కస్పావీధి జంక్షన్, సంతోషి మాత ఆర్చి, సత్యనారారాయణ థియేటర్ ఎదుట ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురయ్యాయి. కూరగాయల బజారు వద్ద రోడ్లపైనే కూరగా యల దుకాణాలు ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో రింగ్‌రోడ్డు జంక్షన్ నుంచి నెహ్రూచౌక్ వరకు మెయిన్ రోడ్డు మొత్తం ట్రాఫిక్ వలయంగా మారిపోతున్నది. దీనికితోడు కొంతమంది వ్యాపారులు వేళాపాళా లేకుండా భారీ వాహనాలను రోడ్లపై నిలిపేసి సరకు లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తూ ట్రాఫిక్ సమస్యను మరింత జటిలం చేస్తున్నారు. ఈ సమస్యను పరిష్క రించాల్సిన జీవీఎంసీ, పోలీసు అధికారులు అంతగా స్పందించడంలేదు. ముఖ్యంగా ఫుట్ పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారిని అడ్డుకోవడంలేదన్న ఆరోపణలు వినిపిస్తు న్నాయి. అదే విధంగా బహుళ అంతస్తుల వాణిజ్య సముదాయాల్లో సెల్లార్లను వాహనాల పార్కిం గ్‌కు కేటాయించాలి. కానీ అత్యధిక వ్యాపార సంస్థలు తమ భవనం సెల్లార్‌ను కూడా వ్యాపార అవసరాలకు వినియోగిస్తు న్నారు. దీంతో ఆయా దుకాణాలకు వచ్చే కొనుగోలు దారులు తమ వాహనాలను రోడు పైనే పార్కింగ్ చేయాల్సి వస్తున్నది. ఎస్పీ నుంచి ఎస్‌ఐ వరకు నిత్యం పట్టణంలో రాకపోకలు సాగిస్తుం టారని, కానీ ట్రాఫిక్ సమస్య, రహదారుల ఆక్రమణల గురించి పట్టించుకోకపోవడం శోచనీయమని పట్టణవా సులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాణిజ్య సముదాయాల్లోని సెల్లార్లలో వాహనాలను పార్కింగ్ చేయించాలని, రహదారులు వెడల్పు గా వున్నచోట వాహనాల నిలుపుదలకు స్థలా లు కేటాయించాలని సూచిస్తున్నారు. కాగా రోడ్లు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణ, ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్‌పై పట్టణ ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, రోడ్లపై వ్యాపారాలు సాగించే వారికి జరిమానాలు విధిస్తున్నామని తెలిపారు. రద్దీ సమయాల్లో ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు అదనపు సిబ్బందిని నియమించామని చెప్పారు.



పట్టణ పోలీసు స్టేషన్‌కు సమీపంలో ఫుట్‌పాత్‌పై వస్త్ర వ్యాపారం



చిననాలుగురోడ్ల కూడలి వద్ద రోడ్డుపైనే దుకాణం

అవినీతి అనకొండ

ఆదాయానికి మించి ఆస్తులు ఆర్జించిన జీవీఎంసీ జోన్-2 కమిషనర్ సింహాచలం

- ఏకకాలంలో ఆరు చోట్ల సోదాలు చేసిన ఏసీబీ అధికారులు
- రూ.రెండు కోట్ల విలువైన ఆస్తుల పత్రాలు లభ్యం
- మార్కెట్ విలువ రూ.25 కోట్లుపైనే...
- ఆది నుంచీ ఆరోపణలు
- వైసీపీ ప్రభుత్వంలో తనకు ఉన్న పలుకుబడిని ఉపయోగించుకుని బయటపడిన వైనం



జోన్-2 కమిషనర్ సింహాచలం



జీవీఎంసీ జోనల్ కమిషనర్ సింహాచలం నివాసంలో ఏసీబీ అధికారుల సోదాలు

విశాఖపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ జోన్-2 కమిషనర్‌గా పనిచేస్తున్న పొందూరు సింహాచలం ఆదాయానికి మించి ఆస్తులు కూడగట్టారనే అభియోగంపై ఏసీబీ అధికారులు కేసు నమోదుచేసి, అరెస్టు చేశారు. అంతకుముందు సింహాచలం నివాసంతోపాటు మధురవాడలోని జోనల్ కార్యాలయం, శ్రీకాకుళం, హైదరాబాద్‌లలోని బంధువుల ఇళ్లలో సోదాలు నిర్వహించి రూ.కోట్ల విలువైన ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి ఏసీబీ డీఎస్పీ బీవీఎస్ నాగేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

సింహాచలం భారీగా ఆస్తులు కూడగట్టారనే సమాచారం అందడంతో ఉన్నతాధికారుల ఆదే శాల మేరకు ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయ స్థానం అనుమతి తీసుకుని మంగళవారం ఉద యం ఐదు గంటల నుంచి ఏకకాలంలో సోదా లు ప్రారంభించారు. మధురవాడ వైశాఖి పెరల్ అపార్టుమెంటులోని ఆయన నివాసం, పనిచేస్తు న్న జోన్-2 కార్యాలయంతోపాటు సింహాచలం స్వగ్రామమైన శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండ లం కేశవరావుపేటలోని తల్లిదండ్రుల నివాసం, కింతలిలోని అత్తగారి ఇ ల్లు, కొత్తపేటలోని వియ్యంకుడి ఇల్లు, హైదరా బాద్‌లోని కుమార్తె ఉంటున్న ఇంట్లో విశాఖ, కర్నూల్ రేంజ్ ఏసీబీ అధికారులు సోదాలు ని ర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పేరిట పలుచోట్ల స్థలాలు ఉన్న ట్టు గుర్తించారు. అలాగే సింహాచలం మేనల్లుడు పేరుతో కాపు లుప్పాడలో 750 గజాల స్థలం ఉంది. అందుకు సంబంధించిన డాక్యుమెంట్ కూడా సింహా చలం ఇంట్లోనే ఏసీబీ అధికారులకు లభ్య మైంది. సోదాల్లో గుర్తించిన ఆస్తుల విలువ డాక్యుమెంట్ ధర ... మిగతా 8వ పేజీలో

గుర్తించిన ఆస్తులు...

సింహాచలం పేరుతో:

- మధురవాడలో 270 గజాల స్థలం
- పరదేశిపాలెంలో 400 గజాల స్థలం
- కాపులుప్పాడలో 200 గజాల స్థలం
- మద్దిలపాలెం కళాభారతి సమీపంలో ఫ్లాట్
- విజయవాడలో ఇంటి స్థలం
- శ్రీకాకుళం జిల్లాలో 13 ఇళ్ల స్థలాలు
- శ్రీకాకుళం జిల్లా కింతలిలో 4.6 ఎకరాల వ్యవసాయభూమి
- ఒక మారుతి బ్రెజ్జా కారు
- 500 గ్రాముల బంగారం
- ఆరు బ్యాంకు అకౌంట్లలో రూ.ఐదు లక్షల నగదు నిల్వలు
- సింహాచలం మేనల్లుడి పేరుతో కాపులుప్పాడలో 750 గజాల స్థలం

ఐపీఎల్‌లో దోసూరు కుర్రాడు



పంజాబ్ కింగ్స్ జట్టుకు ఎంపికైన అవినాశ్

- స్వగ్రామంలో పండుగ వాతావరణం



అచ్యుతాపురం రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):

వ్యవసాయ కుటుంబంలో జన్మించి ఎలాంటి క్రికెట్ బ్యాక్‌గ్రౌండ్ లేకుండా స్వశక్తితో ఐపీఎల్ క్రికెట్‌లో పంజాబ్ కింగ్స్ జట్టులో చోటు దక్కిం చుకున్నాడు మండలంలోని దోసూరు గ్రామానికి చెందిన పైలా అవినాశ్. సోమవారం జరిగిన ఆటగాళ్ల మలివిడత వేలంలో అవినాశ్‌ను రూ.30 లక్షలకు పంజాబ్ జట్టు పాడుకుంది. దీంతో అతని స్వగ్రామంలో పండగ వాతావరణం నెల కొంది.

అచ్యుతాపురం మండలం దోసూరుకు చెందిన పైలా సత్యారావు, నాగమణి దంపతులకు ఇద్దరు.. చరణ్‌తేజ్, అవినాశ్ సంతానం. ఒకటిన్నర ఎకరా భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగించే వారు. అయితే ఆదాయం అరకొరగా వుండడంతో ... మిగతా 8వ పేజీలో

వాయుగండం!

తుఫాన్ ప్రభావంతో జిల్లాకు భారీ వర్షాల ముప్పు

- అధికార యంత్రాంగం అప్రమత్తం
- వరి కోతలు వాయిదా వేసుకోవాలని సూచన
- ఇప్పటికే కోత కోసి ఉంటే.. కుప్ప వేసుకోవాలని సలహా



కోటవురట్ల మండలం కైలాసపట్నంలో కోత కోసి పనలపై ఉన్న వరి పంట

అనకాపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్రవాయుగుండంగా మారింది. బుధ వారంనాటికి ఇది తుఫాన్‌గా మారే అవకాశా లున్నాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. దీని ప్రభావంతో జిల్లాలో రానున్న నాలుగైదు రోజుల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని చెప్పడంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. అన్ని మండలాల రెవెన్యూ అధికారులు, వ్యవసాయా ధికారులు స్థానికంగా ఉండాలని సూచించారు. అధిక వర్షాల వల్ల ఎటువంటి నష్టం వాటిల్లినా తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు ఫోన్ నంబర్లు 08924-226599, 08924-222888 అందుబాటులో ఉంచారు. మత్స్యకారులు సము ద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని ఆంక్షలు విధిం చారు.

రైతుల్లో ఆందోళన

తుఫాన్ హెచ్చరికలతో వరి రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో సుమారు 55 వేల హెక్టార్లల్లో వరి సాగు చేపట్టారు. ముందస్తుగా నాట్లువేసిన పొలాల్లో వారం రోజుల నుంచి వరి కోతలు జరుగుతున్నాయి. వ్యవసాయ శాఖ అధికారుల సమాచారం మేరకు ఇంతవరకు సుమారు పది శాతం విస్తీర్ణంలో వరి కోతలు పూర్తయ్యాయి. గింజ గట్టిపడి, పైరు పుసుపుగా మారి ఎండుతున్న పొలాల్లో వరి కోతలకు రైతులు ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే తీవ్రవాయు గుండం/ తుఫాన్ హెచ్చరికల నేపథ్యం లో వరి కోతలను కొద్దిరోజులపాటు వాయిదా వేసుకో వాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే కోత కోసి వుంటే. వెంటనే కుప్ప వేసుకోవాలని చెబుతున్నారు. కాగా భారీ వర్షాలతోపాటు ఈదురుగాలులు కూడా వీచే అవకాశం వుండడంతో చేతికొచ్చిన వరి పంట నీటిపాలవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ సూచనల మేరకు రానున్న రెండు, మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజయకృష్ణన్ చెప్పారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి వ్యవసాయ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వ హించారు. వర్షాల మూలంగా నీరు కలుషితం కాకుండా పంచాయతీ, మునిసిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ట్యాంకులలో ముందుగానే నీటిని నింపుకోవాలని తెలిపారు. వైద్య, ఆరోగ్య శాఖ అవసరమైనచోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. నీటి పారుద ల శాఖ అధికారులు రిజర్వాయర్ల గేట్లు సక్ర మంగా పనిచేస్తున్నది లేనిది తనిఖీ చేసుకోవా లని, రిజర్వాయర్ల నుంచి నీటిని విడుదల చేసేటట్టయితే దిగువ ప్రాంతాల ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలన్నారు.



ప్రగడ నాగేశ్వరరావును అభినందిస్తున్న ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి. పక్కన మాజీ ఎమ్మెల్సీలు పప్పల చలపతిరావు, బుద్ద నాగజగదీశ్, బీజేపీ నేత ద్వారపురెడ్డి పరమేశ్వరరావు.

ఏపీఎస్ఆర్‌డీసీ చైర్మన్‌గా ప్రగడ బాధ్యతలు స్వీకరణ

రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ (ఏపీఎస్ఆర్‌డీసీ) చైర్మన్‌గా ప్రగడ నాగేశ్వర రావు మంగళవారం విజయవాడలోని కార్పొరేషన్ కార్యాలయంలో ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి, ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మ న్ బత్తుల తాతయ్యబాబు, అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, మాజీ ఎమ్మెల్సీలు పప్పల చలపతిరావు, బుద్ద నాగ జగదీశ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవాని, తదితరులు హాజరై ప్రగడకు శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు.

- ఆంధ్రజ్యోతి/ ఎలమంచిలి



అనకాపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు

కేంద్రం విధానాలకు వ్యతిరేకంగా ర్యాలీలు, ధర్నాలు

కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదంటూ సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అనకాపల్లి, నర్సీపట్నంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. అనకాపల్లిలో సీఐటీయూ కార్యాలయం నుంచి నెహ్రూచౌక్ వరకు ర్యాలీగా నిర్వహించి మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. నర్సీపట్నంలో సీఐటీయూ, ఐద్వా, రైతు సంఘం ఆధ్వర్యంలోఎన్టీఆర్ మినీ స్టేడియం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ ధర్నా చేశారు.

తాండవ రైతులు శ్రమదానం

కుడి కాలువలో నాచు, జమ్ము తొలగింపు





తాండవ కుడి కాలువలో నాచు, జమ్ము తొలగిస్తున్న రైతులు

- మూడేళ్ల నుంచి నిర్వహణ పనులు చేయకపోవడంతో చివరి భూములకు అందని నీరు
- వరి పంట ఎండిపోతుండడంతో కదిలిన అన్నదాతలు

నాతవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):

తాండవ రిజర్వాయర్ కాలువల నిర్వహణను గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు పట్టించుకోకపోవడంతో ఆయకట్టు చివరి భూములకు నీరు సరిగా అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుడి కాలువలో నాచు, తుప్పలు పెరిగిపోవడంతో నీరు అందక పొట్ట, గింజ దశల్లో వున్న వరిపైరు నీటి ఎద్దడికి గురై దిగుబడి తగ్గిపోయే పరిస్థితి నెలకొంది. ఖరీఫ్ సీజన్ ముగిసిన తరువాత ... మిగతా 8వ పేజీలో

జాబ్‌మేళా రేపు

ఎలమంచిలి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 28 వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్టు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎన్. గోవిందరావు తెలిపారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు ఈ మేళా జరుగుతుందన్నారు. పదవ తరగతి నుంచి డిగ్రీ వరకూ చదువుకుని 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల యువతీ, యువకులు పాల్గొనవచ్చునని తెలిపారు. సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని రిఫరెన్స్ నంబరుతో పాటు, ఆధార్ కార్డు, విద్యార్హత పత్రాలు జిరాక్స్ కాపీలతో ఆరోజు ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. వివరాలకు ఫోన్: 8142565416లో సంప్రదించాలని తెలిపారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


నృత్యాలు చేస్తున్న అయ్యప్ప మాలధారులు

ఎలమంచిలి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయం 23 వ వార్షికోత్సవం పురస్కరించుకుని మంగళవారం వీధులన్నీ అయ్యప్ప నామస్మరణతో మార్మోగాయి. వందలాది మాలధారులు రంగులు పూసుకుని ఆలయం నుంచి అయ్యప్ప చిత్రపటంతో పురవీధుల్లో (పేటతుళ్లై) భక్తి నామాలతో ర్యాలీ నిర్వహించారు. స్వామి వారికి తెల్లవారుజాము నుంచి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రాత్రికి ఆలయంలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో గురుస్వాముల పర్యవేక్షణలో పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా ఏకాహం


కొత్తపాలెంలో ఆంజనేయ నామస్మరణ చేస్తున్న భక్తులు

ఎలమంచిలి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధి కొత్తపాలెంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ఉదయం నుంచి 24 గంటలపాటు శ్రీరామ నామస్మరణతో భక్తులు ఏకాహం కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రామాలయం కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీ రామ నామాన్ని జపించారు.

ప్రకృతి విపత్తులపై అవగాహన

నక్కపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రకృతి విపత్తులపై మంగళవారం అవగాహన కల్పించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ పూదో బెటాలియన్ టీం కమాండర్ వై.సత్యనారాయణ,ఎన్‌డీఆర్‌ఎఫ్ బెటాలియన్ కమాండెంట్ వీవీఎస్.ప్రసన్నకుమార్ ప్రకృతి వైపరీత్యాలు, మానవ తప్పిదాల జరిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సోమలింగపాలెంలో ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు


నక్కపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు


మునగపాకలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళి

రాజ్యాంగ బద్ధంగా విధులు నిర్వహించాలి

మునగపాక, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ స్ఫూర్తిగా విధులను నిర్వహిస్తామని ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రతిజ్ఞ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మళ్ల జయమ్మ మాట్లాడుతూ వార్డు స్థాయి మొదలుకుని ప్రధాని వరకు ప్రజలకు ఏ విధంగా పాలన అందించాలనే అంశాలు రాజ్యాంగంలో ఉన్నాయని చెప్పారు. దానికి అనుగుణంగా పాలన అందించడం ప్రజలకు మేలు చేకూర్చవచ్చునన్నారు. ఎంపీడీవో ఎం. ఉషారాణి మాట్లాడుతూ రాజ్యాంగం ప్రాణవాయువు వంటిదన్నారు. అధికారులు, సిబ్బంది సక్రమంగా వారి వారి విధులను నిర్వహించడం ద్వారా రాజ్యాంగ ఫలాలను ప్రతి పౌరుడుకు అందించవచ్చునని తెలిపారు. మునగపాక సచివాలయంలో జరిగిన వేడుకల్లో సర్పంచ్ దిమ్మల అప్పారావు అం బేద్కర్ చిత్ర పటానికి నివాళులర్పించారు. అరబుపాలెం గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ లంబా అప్పారావుతో పాటు పలువురు నివాళులర్పించారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎం ఈవోలు డి.వేణుగోపాలరావు, బుద్ధ శివనాయుడు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సీఆర్పీలు, విద్యార్థులు పాల్గొన్నారు. నాగులాపల్లి ప్రభుత్వ పాఠశాలలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న డీసీసీ ఉపాధ్యక్షుడు పొలమరశెట్టి ఆదిమూర్తి పాల్గొన్నారు. పలు గ్రామాల్లో అంబేడ్కర్‌కు దళిత నాయకులు నివాళులర్పించారు.

ఎలమంచిలి: సోమలింగపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం. బీవీఎస్. సాయిబాబా ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అలాగే, కొక్కిరాపల్లి గురుకుల పాఠశాల, కొక్కిరాపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం పాపాజీరావు ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. రాజ్యాంగం ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. జంపపాలెం, ఏటికొప్పాక, పులపర్తి తదితర పలు గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మజ్జి రాంబాబు, బీసీటీ సామాజిక కార్యకర్త ఎస్.వి.రమణ పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులతో సత్కారం

అంబేద్కర్, భారతమాత వేషధారణ

మునగపాక: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు అంబేద్కర్‌గా, భారతమాత వేషధారణలో అలరించారు. ఆట, పాటలతో పాటు రాజ్యాంగంపై అవగాహన కలిగించే విధంగా ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులకు బహుమతులందజేశారు. ఈ కార్య క్రమంలో ఉపాధ్యాయులు, కమిటీ ఛైర్మన్ ఆడారి సూర్య చంద్రరామారావు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

అచ్యుతాపురం రూరల్: స్థానిక భవానీ విద్యానికేతన్, విశాఖ పబ్లిక్ స్కూల్, కైట్స్ విద్యావిహార్‌ల్లో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు భారత మాత, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వేషధారణల తో ఆకట్టుకున్నారు. తిమ్మరాజుపేట ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం మారిశెట్టి వెంకట అప్పారావు రాజ్యాంగం గొప్పతనాన్ని వివరించా రు. విద్యార్థులతో రాజ్యాంగ మౌలిక లక్షణాలను ప్లకార్డులతో ప్రదర్శన చేయించారు. రాజ్యాంగ పీఠికను విద్యార్థులకు చదివి వినిపించారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాల కరస్పాండెంట్లు కె.సంతోష్, మూర్తిప్రసాద్, గండిబోయిన అప్పలరాజు, రెడ్డి గణేష్, ఉపాధ్యాయురాలు వై.అరుణ కుమారి, అంగన్‌వాడీ కార్యకర్త జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ఎలమంచిలి: జంపపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో రాజ్యాంగ దినోత్సవం హెచ్ఎం ఏవిహెచ్. శాస్త్రి, బొడ్డేడ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు, బాల కార్మిక చట్టాలు, బాల్య వివాహాలపై స్రిప్ట్ రూపంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కూనిశెట్టి శ్రీనివాసరావు, బి. శివ సత్యనారాయణలు పాల్గొని భారత రాజ్యాంగంపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టిడ్కో గృహ సముదాయంలో విషసర్పాల భయం

ఎలమంచిలి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక మునిసిపాలిటీశ్రీరామ్‌నగర్ టిడ్కోగృహ సముదాయంలో విషసర్పాల సంచారంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ కాలనీలో 432 బ్లాకులను నిర్మించి అధికారులు లబ్ధిదారులకు అందించారు. ఇళ్లలో కనీస సౌకర్యాల కల్పించకపోవడంతో పక్కనున్న తోటల నుంచి విషసర్పాలు ఇళ్లలోకి వస్తున్నాయి. కాలనీ చుట్టూ ప్రహరీ లేకపోవడంతో విషసర్పాలు కాలనీలోకి రావడానికి వీలవుతోంది. విషసర్పాలతో ప్రమాదాల బారిన పడాల్సి వస్తుందని పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. టిడ్కో అధికారులు ప్రమాదాల బారిన ప్రహరీ నిర్మించి కాలనీ చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


రామ్‌నగర్ గృహ సముదాయంలో ప్రవేశించిన పాము

వరిలో సస్య రక్షణ చర్యలతోనే తెగుళ్ల నివారణ

అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త సరిత

మునగపాక, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): వరి పంటను ఆశించిన రెల్లరాల్చు, మానిపండు తెగుళ్ల నివారణకు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త ఆర్.సరిత స్పష్టం చేశారు. స్థానిక పేటకట్టు రైతు మూల సంఘంలో సాగులో ఉన్న వరి పొలాలను మంగళవారం శాస్త్రవేత్తలు, అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రెల్లరాల్చు పురుగు నివారణకు చేపట్టాల్సిన చర్యలపై వివరించారు. అనకాపల్లి డీఆర్సీ వ్యవసాయాధికారి పి.విజేత మానిపండు తెగులు నివారణలో జాగ్రత్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వీఏఏ సింధు, రైతులు టెక్కలి సూరిఅప్పారావు, బొడ్డేడ సీతారామరాజు, భీశెట్టి పరదేశినాయుడు తదితరులు పాల్గొన్నారు.


పేటకట్టులో వరి పంటలను పరిశీలిస్తున్న అధికారులు

తుఫాను నేపథ్యంలో అప్రమత్తం

ఎలమంచిలి: నాలుగురోజుల పాటు తుఫాన్ ప్రభావం ఉన్న కారణంగా రైతులంతా అ ప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి మోహనరావు సూచించారు. మంగళవారం తెరువుపల్లి, కట్టుపాలెం ప్రాంతాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ, వరి కోతలు కొద్దిరో జులపాటు నిలుపుచేయాలన్నారు. ఇప్పటికే కోతలు పూర్తయితే, కుప్పలు పెట్టుకోవాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల్లో రబీకి పెసలు, మినుములు, రాగి విత్తనములు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం రైతులకు రెల్లరాల్చుపురుగు, ఆకు ముడత పురుగుల నివారణా చర్యలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

అందుబాటులో వరివిత్తనాలు

రాంబిల్లి: రబీలో సాగుకు వీలుగా వరి విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని ఏవో సి.సుమంత తెలిపారు. మంగళవారం గొరపూడి, హరిపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆమె పలువురు సిబ్బందితో కలిసి వరిపంటను పరిశీలించారు. అనంతర రైతు సేవా కేంద్రాల్లో రైతులతో సమావేశమైనారు. రబీకి అవసరమైన ఎన్ఎల్ఆర్ 34449 నెల్లూరు సన్నాలు, ఎంటీయూ 1121 వరి రకాలు కొప్పుగొండుపాలెం, మురకాడ రైతు సేవాకేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. మినుము, పెసర విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. అనంతరం రైతులకు అపరాలు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈఓ రామారావు, వీఏఏ కోటేశ్వరరావు, కుసుమ, శిరీష, రైతులు పాల్గొన్నారు.


గొరపూడిలో విత్తనాలను అందజేస్తున్న ఏఓ సుమంత

సీఎంను కలిసిన టీడీపీ నేతలు


చంద్రబాబుతో నేతలు చలపతిరావు, ప్రగడ నాగేశ్వరరావు

రాంబిల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ఉండవల్లిలోని ఆయన నివాసంలో మంగళవారం టీడీపీ మాజీ పార్లమెంట్ సభ్యుడు పప్పల చలపతిరావు, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్, టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గం ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రగడ నాగేశ్వరరావు విజయవాడలో ఏపీఆర్‌డీసీ ఛైర్మన్‌గా ప్రమాణస్వీకారం అనంతరం చలపతిరావుతో కలిసి వెళ్లి సీఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు ఇచ్చిన పదవికి పూర్తిస్థాయిలో న్యాయం చేసి పార్టీకి మంచి పేరుతీసుకువస్తానని ప్రగడ నాగేశ్వరరావు తెలిపారు.

'ప్రగడ' ప్రమాణ స్వీకారోత్సవానికి తరలిన టీడీపీ శ్రేణులు


ప్రగడను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

మునగపాక, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ప్రగడ నాగేశ్వరరావు పదవీ ప్రమాణస్వీకారోత్సవానికి మండలం నుంచి భారీగా తెలుగుదేశం పార్టీ శ్రేణులు తరలి వెళ్లాయి. విజయవాడలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి నాయకులు కర్రి సాయికృష్ణ, భీమరశెట్టి శ్రీనివాసరావు, పెంటకోట విజయ్ తదితరులు హాజరయ్యారు. నాగేశ్వరరావును గజమాలతో ఘనంగా సత్కరించి అభిమానాన్ని చాటుకున్నారు. వారితోపాటు సీనియర్ నాయకులు దాడి ముసిలినాయుడు, మొల్లేటి సత్యనారాయణ, డొక్కా నాగభూషణం, దాడి శివ, విల్లూరి నూక నర్సింగరావు, వెలగా మురళి, సూరిశెట్టి అప్పలనాయుడు ప్రగడకు శుభాకాంక్షలు చెప్పారు.

అచ్యుతాపురంనుంచి..

అచ్యుతాపురం రూరల్: ప్రగడ నాగేశ్వరరావు ప్రమాణ స్వీకారోత్సవానికి యలమంచిలి నియోజకవర్గం నుంచి విజయవాడకు వందలాది మంది అభిమానులు, నాయకులు బయలుదేరి వెళ్లారు. స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, మాజీ ఎంఎల్‌సీ పప్పల చలపతిరావు, మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ లాలం భవాని, నాయకులు ధర్మిరెడ్డి నాయుడుబాబు(డ్రీమ్స్ నాయుడు), రాజాన రమేశ్‌కుమార్, ధూళిరంగనాయకులు, కర్రి ఆదిబాబు తదితరులు పాల్గొని ఆయనను అభినందించారు.

అన్న సమారాధన


అన్న సమారాధనలోపాల్గొన్న భక్తులు

మునగపాక, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో వెంకటాపురం శ్రీనీలకంఠేశ్వరస్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్తీకమాసం అన్నసమారాధన 25వ రోజుకు చేరినట్టు సర్పంచ్ సుందరపు నీలకంఠస్వామి వెల్లడించారు. ఆలయం వద్ద మంగళవారం జరిగిన అన్నసమారాధనకు భారీగా భక్తులు వచ్చారన్నారు. ఈ నెల 2నుంచి డిసెంబర్ ఒకటో తేదీవరకు ఈ అన్న సమారాధన కొనుసాగుతుందన్నారు.

రాజుగారిబీడులో వివాదాస్పద స్థలాన్ని పరిశీలించిన అధికారులు


లేఅవుట్ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పాయకరావుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజుగారిబీడులో వివాదాస్పదమైన స్థలాన్ని అధికారులు మంగళవారం పరిశీలించారు. రాజుగారిబీడులో పంచాయతీ స్థలం ఆక్రమణకు గురైందని పలువురు వార్డు సభ్యులు పంచాయతీ పాలకవర్గ సమావేశంలో ఆరోపించడంతో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈవోపీఆర్డీ సిహెచ్.చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి సిహెచ్ఆర్‌కే.వర్మ రాజుగారిబీడులోని వివాదాస్పద స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ సర్వే చేయించి పంచాయతీ స్థలం ఆక్రమణకు గురైందా లేదా అన్న విషయాన్ని గుర్తించి ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తామని తెలిపారు.

కుమారపురంలో పారిశుధ్య పనులు

పాయకరావుపేట రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమారపురం గ్రామంలో మంగళవారం పారిశుధ్య పనులు చేపట్టారు. కాలువల్లో మురికి నీరు రోడ్డుపై చేరి ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నట్టు 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించారు. ఈ మేరకు సర్పంచ్ పిరుమళ్ల గోవిందమ్మ ఆధ్వర్యంలో మురికి నీరు తొలగించి కాలువలను పరిశుభ్రం చేశారు. ఎక్స్‌కవేటర్‌తో రోడ్డుపై చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పిరుమళ్ల రామకృష్ణ, నీలాపు వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వరి కోతలు వాయిదా వేసుకోండి

పాయకరావుపేట రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని వ్యవసాయాధికారి ఆదినారాయణ కోరారు. కేశవరం, రాజవరం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరాలు రైతు సేవా కేంద్రాలలో సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రకృతి వ్యవసాయం, ప్రభుత్వ పథకాల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ గోపీకృష్ణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం


పాయకరావుపే టీడీపీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటం వద్ద నేతల నివాళులు

పాయకరావుపేట/పాయకరావుపేట రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో డాక్టర్ బీఆర్.అంబేద్కర్ చిత్రపటానికి టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, ఉమ్మడి విశాఖ జిల్లాల టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పల్లా విలియంకేరి తదితరులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చింతకాయల రాంబాబు, పెదిరెడ్డి పండు, వేములపూడి అప్పారావు, బోడపాటి శ్రీను, సీహెచ్.పేర్రాజు, ముంజులూరి దుర్గాప్రసాద్, ఎస్.కొండబాబు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలో పాత పంచాయతీ కార్యాలయం, కంటోన్మెంట్, తాండవ జంక్షన్, ఇందిరాకాలనీ, రాజీవ్‌నగర్ కాలనీ, మండల పరిషత్ కాంప్లెక్స్ ఆవరణలో బీఆర్.అంబేద్కర్ విగ్రహాలకు పలువురు దళిత నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో అడ్వకేట్ జీపీ.మధురా గ్రేస్ మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందరికీ అందించడమే రాజ్యాంగ మౌలిక లక్ష్యమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రామకృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఎస్.రాయవరం: అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సర్పంచ్


కోటవురట్ల: అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు, నాయకులు

శ్రీరాంపురం పంచాయతీలో ఎంపీడీవో ఎ.జయప్రకాశరావు, ఈవోపీఆర్డీ చంద్రశేఖరరావు, కార్యదర్శి సత్యనారాయణ, టీడీపీ నేత చించలపు ప్రదీప్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గుంటపల్లిలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీసీసీబీ మాజీ డైరక్టర్ గెడ్డం కన్నబాబు, ఉప సర్పంచ్ కరెడ్ల దొరబాబు, పంచాయతీ కార్యదర్శి సునీత, తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్లలో...

కోటవురట్ల: మండల పరిషత్ సమావేశమందిరంలో రాజ్యాంగం దినోత్సవం సందర్భంగా ఎంపీడీవో కాశీవిశ్వనాథం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కేజీబీవీ ఎస్‌వో సరితదేవి ఆధ్వర్యంలో ఆకర్షించే విధంగా విద్యార్థులు పలు ప్రాజెక్టులు తాయరుచేశారు. జల్లూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల జాతినేత వేషదారణ ఆకట్టుకుంది. ప్రభుత్వ హైస్కూల్, జడ్పీహెచ్ పాఠశాల హెచ్ఎం యేసుదాసు ఆధ్వర్యంలో జాతినేతలు వేషధారణలు ఆకట్టుకున్నాయి. యండపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి దళిత యువకులు, నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఏవోలు చంద్రశేఖర్, సరోజని, ఎంఈవో రామారావు, ఈవోపీఆర్‌డీ రఘురామ్ పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

నక్కపల్లి: మండలంలోని కేజీబీవీలో ఎంఈవోలు కె.నరేశ్, వేమగిరి నూకరాజు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. చినదొడ్డిగల్లు హైస్కూల్‌లో విద్యార్థులు రాజ్యాంగ ప్రాముఖ్యను తెలియజేసే విధంగా తయారు చేసిన నమూనాలు విశేషంగా అలరించాయి. చారిత్రాత్మక కట్టడాలైన తాజమహల్, ఎర్రకోట, సుప్రీం కోర్టు వంటి నమూనాలు పలువురిని ఆకట్టుకున్నాయి. పెదబోదిగల్లం హైస్కూల్‌లో హెచ్ఎం చోడిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం జరిగింది. నక్కపల్లి జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించి కార్యక్రమంలో ఎస్ఐ సన్నిబాబు అంబేద్కర్ రాజ్యాంగ రచనకు సంబంధించిన అంశాల గురించి అవగాహన కల్పించారు. రాజయ్యపేట, వేంపాడు, హైస్కూళ్లల్లో హెచ్ఎంలు నారాయణరావు, మూర్తిరాజు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి భారత రాజ్యాంగ గొప్పతనం గురించి వివరించారు.

ఎస్.రాయవరంలో...

ఎస్.రాయవరం: మండలంలోని అడ్డరోడ్డు తిమ్మాపురం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో సర్పంచ్ కర్రి సత్యనారాయణ పాల్గొని అంబేద్కర్, గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధర్మవరం అగ్రహారంలో ఉప సర్పంచ్ కె.మాణిక్యం, వార్డు సభ్యులు శివమణి, హెచ్ఎం శ్రీనివాసరావు అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహానికి ఆర్థిక సహాయం చేసిన బర్రె అప్పారావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తుఫాన్ హెచ్చరికలతో రైతుల ఆందోళన

కోటవురట్ల, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలతో చేతికందొచ్చే వరి చేను ఎక్కడ నీటిపాలవుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. తుఫాన్ హెచ్చరికలతో బిక్కుబిక్కుమంటున్నారు. దీంతో పంటను కాపాడుకునే పనిల్లో నిమగ్నమయ్యారు. పడిపోయిన పంట, కోతలు కోసి వరి పనలను కాపాడుకునే ప్రయత్నంలో ఉన్నారు. మంగళవారం ఉదయం నుంచి ఒక్కసారిగి ఆకాశం మేఘావృతమై గాలులతో కూడిన చల్లటి వాతావరణం ఏర్పడడంతో రైతులు పొలాల వైపు పరుగులు తీస్తున్నారు. ఇటీవల తుఫాన్ ముప్పు లేకపోయినా వరిచేను చాలా చోట్ల నేలకు ఒరిగిపోయాయి. మధ్యలో వాతావరణం అనుకూలించడంతో ప్రస్తుతం రైతులు కోతదశకు వచ్చిన వరిచేను కోసే పనిలో ఉన్నారు. వర్షాలకు నేలవాలిన వరిని యంత్రాలతో కోత కోయిస్తున్నారు. మరలా వాతావరణంలో అనుకూలించకపోతే నష్టపోతామనే భయంతో యంత్రాలను వినియోగిస్తున్నారు. తుఫాన్ ముప్పుతప్పిందని ఆనందంగా ఉన్న రైతులను, ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మరలా వర్షాలు కురిస్తే మరింతగా దిగుబడులు పడిపోతాయని రైతులు దిగులు చెందుతున్నారు.


కైలాసపట్నంలో వరి పనలను కుప్ప వేస్తున్న రైతులు

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం

ఎస్.రాయవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలతో జీవితాలు నాశనమవుతాయని సీఐ ఎల్.రామకృష్ణ చెప్పారు. మండలంలోని అడ్డరోడ్డులో ఉన్న ప్రజ్ఞ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన సంకల్పం, యాంటీ డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు గంజాయి, మద్యపానం, ధూమపానం వంటి వ్యసనాలకు అలవాటు పడితే భవిష్యత్తు అంధకారం అవుతుందని చెప్పారు. చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని కోరారు. కొంత మంది యువకులు పలు పరిస్థితుల కారణంగా చెడు మార్గంలో వెళ్లి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. డ్రగ్స్ కేసులో పట్టుబడితే నాన్ బెయిల్‌బుల్ కేసు నమోదవుతుందని సీఐ హెచ్చరించారు. అలాగే సైబర్ నేరాల గురించి సీఐ అవగాహన కల్పించారు.

ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు

దేవరాపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) ప్రతీ విద్యార్థి ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధిస్తారని ఎస్ఐ టి.మల్లేశ్వరరావు చెప్పారు. తెనుగుపూడి అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతం చేయాలని కోరారు. గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోకూడదని చెప్పారు. వ్యాయామ ఉపాధ్యాయుడు తరుణేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

చీడికాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు జి.కొత్తపల్లి గ్రామంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిని మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, 108 ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు ఎస్టీ సింహాచలంనాయుడు, మణీశ్, విజయకుమార్, వెంకటేశ్, వినోద్, శ్రీను, గంగాధర్ పాల్గొన్నారు.

రెల్లరాల్చు పురుగుపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

మాడుగుల రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వరిలో రెల్లరాల్చు పురుగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి వాసుదేవరావు సూచించారు. కింతలి వల్లాపురం, అవురువాడ గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటకు ఆశిస్తున్న రెల్లరాల్చు పురుగు నివారణకు పెర్మెత్రిన్ 400 మిల్లీలీటర్లు లేదా బైపెంత్రిన్ 500 మిల్లీటీర్లను 200 లీటర్ల నీటిలో కలిపి సాయంత్రం వేళల్లో పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భగవద్గీతపై ప్రచారం

చోడవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గీత సారాంశం, విశిష్టతను స్థానికులకు వివరించేలా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జ్ఞాన వేదిక అధ్యక్షులు కె.త్రినాథరావు, సభ్యులు వి.భవానీ, అంకమ్మ, లక్ష్మి, సత్యం, శ్యాం, కుసుమ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం

మాకవరపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ పంటల సాగు ఎంతో లాభదాయకమని పతంజలి సీనియర్ మేనేజరు తోట చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం గిడుతూరు గ్రామంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. బింధు సేద్యంపై పలు సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు రమేశ్, టీడీపీ నేత చినబాబు, వ్యవసాయ సిబ్బంది రాజబాబు పాల్గొన్నారు.

..అయినా పే(తే)రు మారలేదు..!

ప్రభుత్వం మారినా అధికారుల తీరు మాత్రం మారడం లేదు. ప్రభుత్వ ఆదేశాల అమలులో వారు ఏమాత్రం చిత్తశుద్ధి కనబర్చడం లేదు. కాగితాలపై ఆదేశాలే కదా! అమలు చేయకపోయినా అడిగే వారెవరు? అన్న ధీమానో... అసలు స్పందించే నాయకులే లేరన్న నిర్లక్ష్యమోగాని, రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలు మార్చుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి కనీసం కట్టుబడినట్టు కనిపించడం లేదు. ఇప్పటికీ 'రైతు భరోసా కేంద్రాలు' అన్న పేరు.. మాజీ సీఎం జగన్ బొమ్మతో భవనాలు కనిపిస్తుండడమే ఇందుకు నిదర్శనం.

- ఆర్బీకేలను రైతు సేవా కేంద్రాలుగా మార్చిన ప్రభుత్వం
- ఆదేశాలు వచ్చినా అమలు చేయని అధికారులు
- ఇప్పటికీ రైతు భరోసా కేంద్రాలుగానే భవనాలు
- మాజీ సీఎం జగన్ బొమ్మతోనే కొనసాగుతున్న వైనం



పాపయ్యపాలెంలో పేరు మారని రైతు సేవా కేంద్రం



శెట్టిపాలెంలో మాజీ సీఎం జగన్ బొమ్మ, ఆర్బీకే పేరుతో భవనం

మాకవరపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ ఆదేశాలు ఎక్కడా అమలు కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడిచినా ఇక్కడ అధికారులు మాత్రం పాత ప్రభుత్వానికే జేజేలు పలుకుతున్నట్టు కనిపిస్తోంది. మండలంలో గత ప్రభుత్వం 15 రైతు భరోసా కేంద్రాలను మంజూరు చేసింది. అయితే వాటిలో ఎనిమిది పూర్తయ్యాయి. మిగిలిన చోట్ల నిర్మాణాల పనులు ముందుకు సాగలేదు. పూర్తిచేసిన ఎనిమిది భవనాలను ఎన్నికల ముందు ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వీటిని రైతు సేవా కేంద్రాలుగా మార్పు చేసింది. అయినప్పటికీ ఈ ఉత్తర్వులను అధికారులు అమలు చేయడం లేదు. దీంతో పాపయ్యపాలెం, పైడిపాల, కొండలఅగ్రహారం, వజ్రగడ, తామరం, శెట్టిపాలెం, రాచపల్లి, జి.కోడూరు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలుగా మాజీ ముఖ్యమంత్రి బొమ్మతో దర్శనమిస్తున్నాయి. ఈ విషయంలో ఇక్కడ అధికారులు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. కాగా, ఆయా కేంద్రాలు కూడా గ్రామాలకు దూరంగా ఉన్నాయి. దీంతో ఆయా భవనాల్లో సిబ్బంది అందుబాటులో లేక రైతులు అక్కడికి వెళ్లడం లేదు. ఫలితంగా కేంద్రాలు వృథాగా పడి ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి భవనాలు పేర్లు మార్పు చేయాలని, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు

గౌరీపట్నంలో ట్రాఫిక్ కష్టాలకు తెర

- ఇరుకు మార్గంలో నిత్యం స్తంభిస్తున్న వాహనాలు
- వాహనాలు ఎదురుపడితే సమస్య ఉత్పన్నం
- ఎమ్మెల్యే చొరవతో డైవర్షన్ రోడ్డు నిర్మాణం


గ్రామంలో వాహనాలు నిలిచిపోవడంతో ఏర్పడిన రద్దీ (ఫైల్)


గౌరీపట్నం మీదుగా నిర్మిస్తున్న డైవర్షన్ రహదారి ఇదే..

చోడవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వంతెన కూలినా.. కాజ్‌వే కొట్టుకుపోయినా.. బీఎన్ రోడ్డులోని గౌరీపట్నం మార్గంలో విపరీతమైన వాహనాల రద్దీ పెరిగిపోతోంది. చోడవరం మీదుగా విశాఖ వెళ్లేందుకు ఇది దగ్గర దారి కావడంతో వాహనదారులు అందరూ ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఈ వాహనాల రద్దీతో గౌరీపట్నంలో తరచూ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి గంటల తరబడి కదిలే పరిస్థితి లేక వాహనదారులు పడే కష్టాలు అన్నీఇన్నీ కావు. గ్రామం మధ్యలో నుంచి వెళ్లే ఈ రోడ్డు పూర్తిగా ఇరుకుదారి కావడం, ఒక వాహనం ఎదురుగా వస్తే మరొకటి తప్పించుకునే అవకాశం లేకపోవడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. రద్దీ సమయాలతో పాటు సాధారణ రోజుల్లో సైతం ఈ రోడ్డులో వాహనాలు వెళ్లాలన్నా ఇబ్బంది ఎదుర్కోక తప్పని దుస్థితి. ఎన్నో సంవత్సరాలుగా ఎదురవుతున్న ఈ ట్రాఫిక్ కష్టాలకు ప్రస్తుతం తెరపడే దిశగా నాయకులు చర్యలు చేపట్టారు.

'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు దృష్టికి స్థానిక కూటమి నాయకులు రహదారి కష్టాలు, ట్రాఫిక్ ఇబ్బందులు గురించి వివరించారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఈ ఇబ్బందులు తప్పించేందుకు గ్రామం వెలుపల నుంచి మరో రోడ్డు నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో ప్రస్తుతం గౌరీపట్నంలో డైవర్షన్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే గ్రామం మీదుగా వెళ్లే వాహనాలు ఇలాగే రావడానికి అవకాశం ఉటుఉంది. ఫలితంగా గ్రామం మధ్యలో రద్దీ తగ్గి ట్రాఫిక్ అంతరాయం సమస్యలకు చెక్ పడుతుందని స్థానిక ప్రజలు, వాహన చోదకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆరుతడి పంటల విత్తనాలు పంపిణీకి సిద్ధం చేయండి

- ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి


వేరుశనగ విత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు, నాయకులు

చీడికాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆరుతడి పంటకు రైతులకు కావాల్సిన విత్తనాలన్నీ సరఫరాకు సిద్ధంగా ఉంచాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆదేశించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద రైతులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. అనంతరం వేరుశనగ, మినుము, పెసర విత్తనాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ ఖర్చు, తక్కువ నీటితో అధిక ఆదాయం వచ్చే ఈ పంటలను వేసేలా రైతులను చైతన్యవంతులను చేయించాలని వ్యవసాయాధికారులకు సూచించారు. అలాగే సేంద్రియ వ్యవసాయం, యాంత్రీకరణ వైపు రైతులు మొగ్గు చూపాలని, యాంత్రీకరణకు ప్రభుత్వం రాయితీలు అందిస్తుందని ఆయన చెప్పారు.

మండల మాజీ వ్యవసాయ కమిటీ చైర్మన్ యర్రా అప్పారావు మాట్లాడుతూ పంట చేతికి వచ్చే సమయంలో రెల్లరాల్చు పురుగు ఉధృతం వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి జలాశయాలు, చెరువులు నిండడంతో అంతా బాగుందని అనుకున్నామని, ఈ క్రమంలో పంట చేతికొస్తుందని ఆశించిన రైతులకు నిరాశ మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి ఎమ్మెల్యే స్పందించి అధికారులు గ్రామాలకు వెళ్లి నష్టపోయిన రైతులను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, ఎంపీడీవో వి.హేమసుందరరావు, ఎంపీటీసీ సభ్యుడు బీశ్ల కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ గండి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘ సభ్య రైతులు వివరాలు ఇవ్వకపోతే చర్యలు

చోడవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలోని సభ్య రైతులు తమ ఆధార్, ఫోన్ నంబరు, నామినీ వివరాలు సమర్పించి ఈకేవేసీ చేయించుకోవాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జి డీఎస్ రాజశేఖర్ మంగళవారం హెచ్చరించారు. సభ్య రైతులంతా ఈ కేవైసీ వెంటనే చేయించుకోవాలని, దీనికి సంబంధించి వివరాలు పూర్తిగా సమర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

250 మందికి వైద్య సేవలు

కృష్ణాదేవిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పాతకృష్ణాదేవిపేట రామాలయం వద్ద మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. కొయ్యూరు, గొలుగొండ మండలాలకు చెందిన చెందిన 250 మంది ఈ శిబిరంలో వైద్య సేవలు పొందారు. వైద్య నిపుణులు అజయ్‌స్రవంత్, మణిదీప్‌రెడ్డి, సాయికృష్ణ తదితరులు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన మందులను అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పందిరి సత్యంనాయుడు, ఉప సర్పంచ్ డి.సహదేముడు, ఎస్ఐ వై.తారకేశ్వరరావు, సీపీఐ నాయకులు మేకా సత్యనారాయణ, భాస్కరరావు, జనసేన నాయకులు ఈర్నీ చిన్ని, శివాజీ, గోపి పాల్గొన్నారు.

వరిలో తెగుళ్లపై రైతులకు అవగాహన

రావికమతం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వరిని ఆశించే తెగుళ్లు, నివారణ చర్యలపై శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ కళాశాల విద్యార్థినులు రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం కొత్తకోట, మత్స్యవానిపాలెం గ్రామాలలో పొలాలను వారు పరిశీలించారు. అనంతరం రెల్లరాల్చు పురుగు నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థినులు వి.జ్యోతిశ్రీ, కె.దివ్యామిని, డి.ప్రతిభ, ఎం.అనుపమ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేపై 390 ఫిర్యాదులు

- తహసీల్దార్ నాగమ్మ



రోలుగుంట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భూముల సమస్యల పరిష్కారానికి చేపట్టిన రెవెన్యూ సదస్సుల్లో 16 రెవెన్యూ గ్రామాల నుంచి 390 ఫిర్యాదులు అందాయని తహసీల్దార్ నాగమ్మ తెలిపారు. మంగళవారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ నెల రోజులుగా నిర్వహించిన సదస్సుల్లో ఈ వినతులను స్వీకరించినట్టు చెప్పారు. వీటిలో అధికంగా భూముల హెచ్చుతగ్గులకు సంబంధించి 151 ఫిర్యాదులు, ల్యాండ్ క్లారిఫికేషన్‌కు సంబంధించి 15 దరఖాస్తులు, పట్టాదారుల పేర్లు మార్పు సంబంధించి 14, సర్వే నంబర్లు మార్పుపై 14, సర్వే చేసినా ఆన్‌లైన్ అవ్వకుండా, వెబ్‌ల్యాండ్‌లో నమోదు కాని వాటిపై 151 దరఖాస్తులు, జాయింట్ ఎల్‌పీఎంపై రెండు, ఫోటో మార్పు, పాసుపుస్తకంలో తప్పుగా నమోదుపై నాలుగు దరకాస్తులు వచ్చినట్టు ఆమె తెలిపారు. ఫిర్యాదుదారులకు రశీదులు ఇచ్చామని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ వివరించారు.

బ్రూసెల్లా వ్యాధి నిరోధక వ్యాక్సినేషన్ పరిశీలన


రికార్డులు పరిశీలిస్తున్న ఏడీ చిట్టిబాబు

మాడుగుల రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవరంలో జరుగుతున్న బ్రూసెల్లా వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని మాడుగుల ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు చిట్టినాయుడు మంగళవారం పరిశీలించారు. సచివాలయ పరిధిలో ఎంత వరకు వ్యాక్సినేషన్ జరిగిందనే వివరాలపై ఆరా తీశారు. అలాగే వాటి రికార్డులు తనిఖీ చేశారు. ఇప్పటివరకు మండలంలో 120 ఆడ పెయ్యిలకు టీకాలు వేశామని, బ్రూసెల్లా వ్యాధి నిరోధక టీకా కార్యక్రమం డిసెంబరు 19వ తేదీ వరకు జరుగుతుందని, పాడి రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఏడీ చిట్టినాయుడు తెలిపారు.

కార్యకర్తలకు అండగా చంద్రబాబు: ఎమ్మెల్యే రాజు


నరసింగరావు కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పార్టీ కార్యకర్తలకు అధినేత చంద్రబాబునాయుడు ఎప్పుడూ అండగా ఉంటారని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. ప్రమాదవశాత్తూ మృతి చెందిన నరసాపురం గ్రామానికి చెందిన బూర నరసింగరావు కుటుంబానికి పరిహారం అందజేశారు. పార్టీ సభ్యత్వ బీమా పరిహారం కింద మంజూరైన రూ.2 లక్షలను ఆయన భార్య గంగతల్లికి మంగళవారం అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, నాయకులు దొడ్డి అప్పారావు, ఆడారి నాగ అప్పారావు, కె.రమణమూర్తి పాల్గొన్నారు.

రూ.2.05 కోట్లతో బాలికల వసతిగృహం నిర్మాణం

చోడవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రూ.2.05 కోట్లతో బాలికల వసతిగృహం నిర్మించనున్నట్టు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. ఈ హాస్టల్ భవనాల నిర్మాణాల కోసం మంగళవారం రాత్రి కొత్తూరు జంక్షన్‌లోని బాలికల హైస్కూల్ ఆవరణలోని స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ ఆవరణలోనే హాస్టల్ నిర్మిస్తే ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో డీఈఈ నరసింహారావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు డీవీ అప్పారావు, స్కూల్ కమిటీ చైర్మన్ జి.సత్య, కాంట్రాక్టర్ సుంకర సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతాలు


వ్రతాలు చేస్తున్న భక్తులు

నర్సీపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బలిఘట్టం ఉత్తరవాహిని వద్ద వెలసిన రమా సమేత సత్యనారాయణ స్వామి ఆలయంలో భక్తులు సామూహిక వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం కార్తీక బహుళ ఏకాదశి సందర్భంగా ప్రధాన అర్చకులు భద్రాచలరామం ఆధ్వర్యంలో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు జరిగిన వ్రతాలలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

డ్రోన్‌తో పురుగు మందుల పిచికారీ


చోద్యం గ్రామంలో డ్రోన్‌తో పురుగు మందుల పిచికారీ దృశ్యం

గొలుగొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): డ్రోన్‌తో పురుగు మందులు పిచికారీ చేపడితే తక్కువ ఖర్చవుతుందని వ్యవసాయాధికారి సుధావాణి తెలిపారు. ఎర్రవరం, చోద్యం గ్రామాల్లో మంగళవారం పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రోన్‌తో పురుగు మందుల పిచికారీ చేపట్టారు. యాంత్రీకరణతో సాగు పెట్టుబడి తగ్గుతుందని ఏవో తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


నర్సీపట్నం: రాజ్యాంగ దినోత్సవం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో నాగేంద్ర


చోడవరం మండల పరిషత్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో తదితరులు


మాడుగులలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలోని అన్ని మండలాల్లో ఈ వేడుకలు ఉత్సాహంగా సాగాయి. ఈ సందర్భంగా రాజ్యాంగంపై అధికారులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

నర్సీపట్నం నియోజకవర్గంలో...

నర్సీపట్నం/నర్సీపట్నం రూరల్/మాకవరపాలెం/గొలుగొండ/కృష్ణాదేవిపేట/నాతవరం: నర్సీపట్నం నియోజకవర్గం కేంద్రంతో పాటు అన్ని మండలాల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రతీ పౌరుడు భారత రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలని జెడ్పీహెచ్ పాఠశాల (మెయిన్)లో ఇన్‌చార్జి హెచ్‌ఎం డి.నూకరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నర్సీపట్నం ఎంఈవో నాగేంద్ర అన్నారు. అలాగే చెట్టుపల్లి జడ్పీహెచ్ పాఠశాలలో హెచ్‌ఎం హిమబిందు, డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్.రాజు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, కుల వివక్ష పోరాట సమితి జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి ఆధ్వర్యంలో అబీద్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నర్సీపట్నంలో కోర్టు సముదాయంలో సివిల్ జడ్జి ఎస్.మధుసూదనరావు, న్యాయమూర్తులు ప్రతిజ్ఞ చేయించారు. న్యాయవాదులు, సుర్ల కన్నయ్యనాయుడు, కోసూరి అప్పలనాయుడు, వాస విదత్త, వాసవి పాల్గొన్నారు. కృష్ణాదేవిపేటలో జరిగిన కార్యక్రమంలో ఏఎల్‌పురం సర్పంచ్ లోచల సుజాత, కార్యదర్శి శ్రీనివాస్, టీడీపీ నాయకులు జమీలు, చిట్టిబాబు పాల్గొన్నారు. గొలుగొండ కార్యక్రమంలో ఎస్ఐ రామారావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు, ఇన్‌చార్జి ఎంఈవో మూర్తి పాల్గొన్నారు. మాకవరపాలెం కార్యక్రమంలో ఎంఈవో మూర్తి, కేజీబీవీ ఎస్‌వో త్రివేణి పాల్గొన్నారు. నాతవరంలో రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ కె.మరిడియ్య ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈవోపీఆర్డీ మూర్తి, ఏపీవో చిన్నారావు, ఎంఈవో వరహాలబాబు పాల్గొన్నారు.

చోడవరం నియోజవకర్గంలో...

చోడవరం/రావికమతం/రోలుగుంట: నియోజకవర్గం పరిధిలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చోడవరంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, వైస్ ఎంపీపీలు బైన ఈశ్వరరావు, బుద్దా గంగరాజు, ఈవోపీఆర్డీ మహేశ్ పాల్గొన్నారు. అలాగే జుత్తాడ హైస్కూల్‌లో హెచ్‌ఎం రమేశ్, ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్, ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. రావికమతం కార్యక్రమంలో దళిత బహుజన సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు మల్లేటి రాజు, ఎంపీటీసీ సభ్యుడు పూడి దేవా తదితరులు పాల్గొన్నారు. రోలుగుంట కార్యక్రమంలో కుసర్లపూడి హెచ్‌ఎం మోహన్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాడుగుల నియోజకవర్గంలో...

మాడుగుల రూరల్/దేవరాపల్లి/చీడికాడ/ కె.కోటపాడు: మాడుగుల నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల్లో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. మాడుగుల కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లపు రెడ్డి రాజారామ్, ఎంపీడీవో కె.అప్పారావు పాల్గొన్నారు. కె.కోటపాడు కార్యక్రమంలో సర్పంచ్ వై.భవాని, పంచాయతీ కార్యదర్శి శ్రీన తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో తహసీల్దార్ పి.లక్ష్మీదేవి, ఎస్ఐ టి.మల్లేశ్వరరావు అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ పెంటమ్మ, ఎన్ఎస్ఎస్ పీవో కె.కొండలరావు, ప్రిన్సిపాల్ బి.రాధ పాల్గొన్నారు. చీడికాడలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఖండివరం ఎంపీడీవో హేమసుందరరావు, గ్రంథాలయాధికారి జోగేశ్వరి, టీడీపీ నేత జి.నానాజీ, కార్యదర్శి పద్మావతి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ కార్మిక విధానాలకు వ్యతిరేకంగా ధర్నా



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ, రైతు సంఘం నాయకులు

నర్సీపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక విధానాలకు వ్యతిరేకంగా సీఐటీయూ, ఐద్వా, రైతు సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ, సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ధర్నా జరిగింది. మంగళవారం ఎన్టీఆర్ మిని స్టేడియం నుంచి ర్యాలీగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని కేంద్ర ప్రభుత్వ విధానాలను దుయ్యబడుతూ కార్మికులు నినదించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని విమర్శించారు. రైతు చట్టాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చి మోదీ ప్రభుత్వం పట్టించుకోలేదని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం లేదని వాపోయారు. కార్మికులకు నష్టం కలిగించేలా నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చారని, వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు అడిగర్ల రాజు, ఐద్వా నాయకులు సూర్యప్రభ, ఎల్‌గౌరీ, రైతు సంఘం నాయకులు నారాయణమూర్తి, కేవీపీఎస్ నాయకుడు ఈరెల్లి చిరంజీవి, భోజన నిర్వాహకుల సంఘం జిల్లా అధ్యక్షురాలు ప్రసన్న పాల్గొన్నారు.

పౌరులందరికీ సమాన హక్కులు

- భారత రాజ్యాంగ దినోత్సవంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్


ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జాయింట్ కలెక్టర్ జాహ్నవి

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం పౌరులందరికీ సమాన హక్కులు కల్పించిందని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. ఇక్కడి కలెక్టరేట్‌లో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యం సాధనకు, భారతదేశ రూపకల్పనకు ఎందరో మహానుభావులు తమ జీవితాలను త్యాగం చేశారన్నారు. ప్రతి వ్యక్తి స్వేచ్ఛగా బతికేలా వీలు కల్పిస్తూ రాజ్యాంగాన్ని రూపొందించి 1949 నవంబరు 26న అమలులోకి తీసుకు వచ్చారన్నారు. రాజ్యాంగంలో వ్యక్తి స్వేచ్ఛ, హక్కులతో పాటు ప్రతి వ్యక్తికి విధులు కూడా పొందుపరిచారని వివరించారు. జాయింట్ కలెక్టర్ జాహ్నవి మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి న్యాయం, సామాజిక, ఆర్థిక, రాజకీయ సంక్షేమ ఫలాలు అందేలా రాజ్యాంగ నిర్మాణం జరిగిందన్నారు. అనంతరం అంతా కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో దయానిధి, కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారిణి బీవీ రాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు


పాడేరులో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ


చింతపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు, అధికారులు

రాజ్యాంగం ద్వారానే పౌరులకు హక్కులు

» కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం ద్వారానే పౌరులంతా హక్కులు పొందుతున్నట్టు కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన మా ట్లాడుతూ... 1949 నవంబరు 26 రాజ్యాంగాన్ని ఆమోదించినట్టు చెప్పారు. ప్రత్యేకంగా గిరిజనుల కోసం రాజ్యాంగంలో షెడ్యూల్ 5, 6లను పొందుపరిచారన్నారు. అనంతరం అధికారులు, ఉద్యోగులతో ఆయన రాజ్యాం గంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ, జిల్లా రెవెన్యూ అధికారి పద్మలత, డీఆ ర్‌డీఏ పీడీ వి.మురళి, వివిధశాఖల అధికారులు, సిబ్బంది పా ల్గొన్నారు.

ఐటీడీఏ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం

స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోనూ మంగళవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఐటీడీఏ ఏపీవోలు వీఎస్.ప్రభాకరరావు, ఎం.వెంకటేశ్వరరావు, పరిపాలనాధికారి ఎం.హేమలత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా రాజ్యాంగ దినోత్సవం ప్రత్యేకతను తెలిపారు. ఈకార్యక్రమంలో ఐటీడీఏలోని వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ న్యాయం జరిగేలా రాజ్యాంగం

కొయ్యూరు: దేశ ప్రజలందరికీ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలను అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం ద్వారా సమకూర్చారని ఎంపీడీవో ప్రసాద్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంతో పాటు పలు గ్రామ సచివాయాలు, పాఠశాలల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జి. మాడుగలలో...

జి.మాడుగుల: రాజ్యాంగ దినోత్సవం నిర్వహించడం ప్రతి పౌరుడి బాధ్యత అని జైభీమ్ ఫౌండేషన్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ మేరకు రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాగేని కోటిబాబు, కిముడు కల్యాణం ఆర్. కొండబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనంతగిరిలో..

అనంతగిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీపీ శెట్టి నీలవేణి, ఎంపీడీవో ఏవీవీ.కుమార్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్యాంగం, ప్రపంచ ప్రజాస్వామ్య దేశాలకే దిక్సూచి అని గుర్తుచేశారు. మహత్తరమైన రాజ్యాంగాన్ని అందించిన అంబేద్కర్ చిరస్మరణీయులన్నారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ రామం, కార్యదర్శి దేవా, తదితరులు పాల్గొన్నారు.

పాడేరు మండలంలో..

పాడేరురూరల్: రాజ్యాంగ 75వ దినోత్సవం మండలంలో వాడవాడలా ఘనంగా నిర్వహించారు. పాడేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళలర్పించారు. పాఠశాల హెచ్ఎం, ఇన్‌చార్జి ఎంఈవో ఎస్.విశ్వ ప్రసాద్ అధ్యక్షతన చేపట్టిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు గిరిజనయువత కృషి చేయాలన్నారు. విద్యార్థులతో రాజ్యాంగంపై ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంఘిక శాస్త్ర మోడల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా సోషల్ ఉపాధ్యాయుడు వన్నెపూరి భీమ్‌నాయుడు నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులందించారు. ఉపాధ్యాయులు ప్రసాద్, కన్నయ్య, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.ఏపీఈపీడీసీఎల్ సర్కిల్ కార్యాలయంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ జీఎన్.ప్రసాద్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాడేరు డివిజన్ ఈఈ ఏవీఎన్ఎం.అప్పారావు, ఇంజనీర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వనుము చిట్టబ్బాయి ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం జరిగింది. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ టీఎస్ రసూల్, పి.కోటేశ్వరరావు, వి.రమేశ్‌బాబు, ఎ.మురళీధరరావు, పి.సౌజన్య, డి.గణేశ్, జి.దామోదరరావు, జి.గౌరీశంకరరావు, అచ్యుత్, గోవిందరాజు, అప్పలనాయుడు, కొత్తంనాయుడు తదితరులు పాల్గొన్నారు. ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావు దొర, జీఎస్‌యూ నాయకులు బి.మాధవరావు, ఎం. బాబూజీ పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: ప్రపంచంలోనే భారత రాజ్యాంగానికి ప్రత్యేక గుర్తింపు ఉన్నదని స్థానిక తహసీల్దార్ టి. రామకృష్ణ అన్నారు. మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. డీటీ సీతారామ్, రీసర్వే డీటీ దుమంతి సత్యనారాయణ, ఆర్ఐ మహదేవ్, చిన్నయ్యపడాల్, వీఆర్వోలు పాల్గొన్నారు.



దుంబ్రిగుడలో అంబేద్కర్ చి త్రపటానికి నివాళులర్పిసున్న అధికారులు

చింతపల్లిలో..

చింతపల్లి:మండల పరిషత్ కార్యాలయం ఎదుట అంబేడ్కర్ విగ్రమానికి ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు, ఆర్ఏఆర్ఎస్‌లో ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి, డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయ భారతి, పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ దురియా పుష్పలత అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులు, అధికారులు ప్రతిజ్ఞ చేశారు. ఏవో రవీంద్ర, పీఆర్ ఏఈఈ బాలకిశోర్, వెలుగు ఏపీఎం శ్రీనివాస్, కూటమి నాయకులు రీమల ఆనందరావు, బుజ్జిబాబు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో..


అనంతగిరిలో..

డుంబ్రిగుడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ప్రేమ్ సాగర్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి ఘన నివాళులను అర్పించి ప్రతిజ్ఞ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బారావు ఎన్ఆర్‌జీఎస్ ఏపీవో సూరిబాబు, టీఎస్‌టీయూసీ నాయకులు స్వామి పాల్గొన్నారు.

సీలేరు: సీలేరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో రాజ్యాంగ దినోత్సవంపై విద్యార్థులకు ప్రిన్సిపాల్ శంకరరావు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ పీఓ శ్రీను, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అనంతగిరిలో అంబేడ్కర్ చి త్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

ప్రధాన రహదారిలో సంత నిర్వహణతో ట్రాఫిక్ సమస్య

» రోడుపై దుకాణాలతో రాకపోకలకు తీవ్ర ఆటంకం

» సీలేరులో దుస్థితి

సీలేరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరు మార్కెట్‌సెంటర్‌లో ఆదివారం సంత రోజున దుకాణాలను వ్యాపారులు రోడ్లపైనే నిర్వహిస్తుండడంతో వాహనదారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం నెలకొంటోంది. ఈ సంతకు దుప్పులవాడ, ధారకొండ, గుమ్మిరేవుల, పంచాయతీల గిరిజనులతోపాటు ఒడిశా సరిహద్దు గ్రామాల ఆదివాసీలు వారు పండించిన కూరగాయలు, అపరాలు, ఇతర సరుకులను తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. సీలేరు మార్కెట్ సెంటర్‌లో గిరిజనులు , మైదాన ప్రాంత్రంతాల నుంచి వచ్చిన వ్యాపారులు దుకాణాలను వేసుకుని ఉదయం నుంచి సాయంత్రం వ రకు అమ్మకాలు జరుపుతారు. ఆదివారం సంత కావడంతో మారుమూల గ్రామాల నుంచి వచ్చే ఆటో లతోపాటు ఈ ప్రాంతానికి వచ్చే పర్యాటకుల కార్లు, ఇతర వాహనాలతో మార్కెట్ రోడ్డు రద్దీ నెలకొని ట్రాఫిక్ కు అంతరాయం నెలకొంటోంది. గతంలో సంత జరుగుతున్న సమయంలో మార్కెట్‌లోకి బస్సు లు, ఆటోలు రాకుండా పోలీసులు ఆంక్షలు పెట్టారు. ఆదివారం రామాలయం సెంటర్‌లోనే బస్సులు, ఆటోలు నిలిపేలా చర్యలు తీసుకున్నా, కొంతమంది ఆటో డ్రైవర్లు ఇష్టారాజ్యంగా


రోడ్లపైనే దుకాణాలతో నిలిచిన వాహనాలు

సంతలోనికి రావడంతో బస్సుల సిబ్బంది తెలియక లోనికి రావడంతో ట్రాఫిక్ అంతరాయం తీ వ్ర తరమవుతోంది. సంతను గతంలోలా శివాలయం సెంటర్‌లో నిర్వహిస్తే ఇక్కడ ట్రాఫిక్‌కు సమస్య తలెత్తదు. ఈ మేరకు సచివాలయ అధికారులు, పోలీసు శాఖ స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ప్రచార చేయాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, తదితరులు

పాడేరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించే పోస్టర్‌ను మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్, అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఆయా గోడ పత్రికలను అన్ని మండల కేంద్రాలకు, గ్రామైఖ్య సంఘాలకు పంపించి జెండల్ ఆధారిత హింసపై ప్రజల్ని చైతన్యవంతం చేయాలని కలెక్టర్ ఈసందర్భంగా సూచించారు. ఈకార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వి.మురళీ, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి రోహిణి, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నంద్, జిల్లా ఉద్యానవన అధికారి రమేశ్ కుమార్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ చైర్మన్‌కు కిడారి అభినందన


వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్‌ను అభినందిస్తున్న జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్

పాడేరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వీఎంఆర్‌డీఏ చైర్మన్‌గా మంగళవారం పదవీ స్వీకారం చేసిన ప్రణవ్‌గోపాల్‌ను జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ కలిశారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛమందించి అభినందించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నేతలు పాంగి పాండురంగస్వామి, టి.సత్యనారాయణ, బి.జగదీశ్, మురళీ, అచ్చిబాబు, తదితరులున్నారు

విద్యార్థికి అభినందన


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన లోహిత్‌ను అభినందిస్తున్న కలెక్టర్


డుంబ్రిగుడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీకి ఎంపికైన శెట్టి లోహిత్‌ను కలెక్టర్ దినేశ్‌కుమార్ అభినందించారు. ఇటీవల గుంటురులో జరిగిన రాష్ట్రస్థాయి పరుగు పందెంలో ప్రతిభ చూపి ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు లోహిత్ ఎంపికయ్యాడు. ఈ నేపథ్యంలో కలెక్టర్ లోహిత్‌ను అభినందించారు. క్రీడా రంగంలో గిరిజన యువతను ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. చిన్నారులు చదువుతోపాటు క్రీడారంగంలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగ జిల్లా నాయకుడు సురేశ్‌కుమార్ రవి పాల్గొన్నారు.

'హెల్త్ సెక్రటరీలపై పని ఒత్తిడి తగదు'


డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందిస్తున్న హెల్త్ సెక్రటరీలు

పాడేరురూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏఎస్ఆర్ జిల్లా ఏజెన్సీ ప్రాంత సచివాలయాల్లో పనిచేస్తున్న హెల్త్ సెక్రటరీలకు జీవో 124ను అమలు చేసి పని ఒత్తిడి నుంచి వారిని తప్పించాలని ఉద్యోగ సంఘ నాయకులు కోరారు. మంగళవారం డీఎంహెచ్‌వో షేక్ జమీల్‌బాషాకు ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో 124 విడుదల చేసిన అ ధికారులు సచివాలయ హెల్త్ సెక్రటరీలు ఆరోగ్య శాఖ పరిధిలో పనిచేయాలని ఆదేశాలిచ్చినా, ఎంపీడీవోలు వాటిని అమలు చేయడంలేదని ఆరోపించారు. తమ శాఖనుంచి వేతనాలు చెల్లిస్తున్నందున వైద్య ఆరోగ్య శాఖలో విధులతోపాటు తాము చెప్పిన పనులు చేయాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. దీంతో రెండు శాఖల మధ్య విధులు నిర్వహించడం ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. అధికారులు స్పందించి సచివాలయం హెల్త్ సెక్రటరీలు ఏ శాఖ పరిధిలో విధులు నిర్వహించాలో అధికారులు స్పష్టం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అలాగే, 124 జీవోను అమలు చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు శెట్టి నాగరాజు, నాయకులు ఎంవీవీఎస్ కుమారి, కె.సుశీల, పుష్పవతి, రాజేశ్వరి, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ యూనియన్ నాయకుడు కె.లక్ష్మణరావు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతోనే మేలు



వ్యవసాయ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్ వెంకట్

చింతపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులు సేంద్రీయ పద్ధతిలోనే సాగు చేయాలని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ వెంకట్ సూచించారు. మంగళవారం అంతర్ల రైతు సేవా కేంద్రంలో కొయ్యూరు, జీకేవీధి, చింతపల్లి మండలాల వ్యవసాయ కార్యకర్తలకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈసందర్భంగా మాస్టర్ ట్రైనర్ మాట్లాడుతూ... వ్యవసాయ కార్యకర్తలకు ఈనెల 30తేదీ వరకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. కార్యకర్తలు నేర్చుకున్న విషయాలను గ్రామ స్థాయిలో రైతులకు తెలియజేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకర జీవనానికి సేంద్రీయ పద్ధతిలో సాగు చేసుకున్న ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవాలన్నారు. రసాయనాలను వినియోగించరాదన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలకు మార్కెట్‌లో అధిక ధర లభిస్తుందన్నారు.

కేంద్ర ప్రభుత్వం రైతులు, కార్మిక వ్యతిరేక విధానాలు

» ప్రజా సంఘాల నాయకులు ర్యాలీ



ర్యాలీలో నిర్వహిస్తున్న వివిధ సంఘాల నాయకులు

పాడేరురూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం రైతులు, కార్మికుల వ్యతిరేక విధానాలు అమలు చేస్తోందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, ఆదివాసీ కాఫీ రైతు సంఘం జాతీయ నాయకులు జి.చినబాబు విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు వ్యతిరేకంగా రైతు, కార్మిక సంఘాలు సంయుక్తంగా మంగళవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా ఐటీడీఏ కార్యాలయం నుంచి భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర కార్మిక సంఘం పిలుమేరకు ఈ నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం మూడవ సారి అధికారం చేపట్టినా పాత విధానాలనే అవలంభిస్తూ తీవ్రమైన ద్రోహం చేస్తోందన్నారు. ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరణ, రైతులకు గిట్టుబాటు ధర కల్పించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు ఆరోపించారు. గిరిజన ప్రాంతంలో కాఫీరైతులు పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం లేదన్నారు. రూ.కోట్లలో బకాయిలు పెడుతూ రైతులను సమస్యల్లో నెడుతున్నారన్నారు. ప్రభుత్వ రంగాల్లో పనిచేస్తున్న స్కీం వర్కర్లను రెగ్యులర్ చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏలో పనిచేస్తున్న డైలీవేజ్ కార్మికులకు కలెక్టర్ గెజిట్ జీవో ప్రకారం రూ. 26 వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వివిధ సమస్యలపై కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పి.లక్కు, ఎల్.సుందరరావు, తసురేష్, అమర్, రాజబాబు, అన్నపూర్ణ, దాసమ్మ, పద్మ, సరస్వతి, భవానీ తదితరులు పాల్గొన్నారు.

'రాంబాబు సేవలు మరువలేనివి'


స్థూపం ఎదుట నివాళులర్పిస్తున్న నాయకులు

కొయ్యూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతానికి కమ్యూనిస్టు నాయకుడు రాంబాబు చేసిన సేవలు మరువలేనివని నల్లగొండ సర్పంచ్ రాజకుమారి తదితరులు పేర్కొన్నారు. మంగళవారం నల్లగొండ గ్రామంలో కామ్రేడ్ జంపా రాంబాబు 7వ వర్ధంతిని కుటుంబీకులు, గ్రామస్తులు, కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజకుమారి, చింతలపూడి మాజీ సర్పంచ్ గుమ్మా రాంబాబు తదితరులు పాల్గొని రాంబాబు సేవలను కొనియాడారు. ఎ ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు నానాజీ, నేతలు కుమార్, కృష్ణనాయుడు, అన్నపూర్ణ నూకరాజు తదితరులు పాల్గొన్నారు. ముందుగా రాంబాబు స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు. దివంగత కమ్యూనిస్టు నేత మేకా సూరిబాబు అనుచరునిగా మండల కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా రాంబాబు గిరిజన ప్రాంతంలో హక్కుల కోసం కృషి చేశారని కొనియడారు.

ఉచిత మెగా వైద్య శిబిరం


రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న రాయల్ హాస్పిటల్ ఎండీ లక్ష్మణరావు

సీలేరు, నవంబరు 26 , (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరులో మంగళవారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక ఏపీ జెన్‌కో ఫోర్‌మెన్ పి. నారాయణరావు (నానాజీ) ఆధ్వర్యంలో విశాఖ జిల్లా ఆనందపురం రాయల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో జెన్‌కో కళ్యాణ మండపంలో ఈ వైద్య శిబిరాన్ని జెన్‌కో ఈఈ రాజేంద్రప్రసాద్, ఎస్ఐ రవీంద్ర, సర్పంచ్ దుర్జో, ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి ప్రారంభించారు. ఈ శిబిరంలో రాయల్ హాస్పిటల్ ఎండీ ఆర్థో, న్యూరో స్పెషలిస్టు బి. లక్ష్మణరావు పాల్గొని రోగులకు వైద్య సేవలందించారు. సీలేరు, దారకొండ, గుమ్మిరేవుల, దుప్పులవాడ పంచాయతీలనుంచి 500 మంది వచ్చి వైద్య సేవలుపొందారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు స్థానిక బాలాజీ రెస్టారెంట్ యజమాని నక్కా జ్ఞానేశ్వరరావు ఉచితంగా భోజనాలను ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో రాయల్ హాస్పిటల్ చెందిన గైనకాలజిస్ట్ లాస్మి, సీలేరు వైద్యాధికారిణి కె సౌమ్య, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సాయుధ దళాల పతాక దినోత్సవ పోస్టర్లు ఆవిష్కరణ


స్టిక్కర్లు, పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరురూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో డిసెంబరు 7న జరగనున్న సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ మంగళవారం స్టిక్కర్లు, పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ స్టిక్కర్లను జిల్లాలోని వి విధ కార్యాలయాలకు పంపిణీ చేసి, వాటి అమ్మకం ద్వారా వచ్చిన సొమ్మును యుద్ధంలో మృతి చెందిన, గాయపడిన వారి కుటుంబాల సంక్షేమం కోసం వినియోగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమాధికారి జి.సత్యానందం, సీనియర్ సహాయకులు శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

14న ఐక్య క్రిస్మస్ వేడుకలు


స్టిక్కర్లు, పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

అరకులోయ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీబీఎం చర్చి కాంపౌండ్‌లో డిసెంబరు 14 వ తేదీన నిర్వహించనున్న క్రిస్మస్ సెలబ్రేషన్స్ పోస్టర్లను సీబిఎం ఫీల్డ్ డైరెక్టర్ వెయిన్‌జోసెఫ్, క్రైస్తవ ఐక్యవేదిక సభ్యులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా దైవజనులు సీబీఎం ఫీల్డ్ డైరెక్టర్ వెయిన్‌జోసెఫ్ పాల్గొన్నారు. అరకులోయ క్రైస్తవ ఐక్యవేదిక ఆధ్వర్యంలో డిసెంబరు 14 వ తేదీన నిర్వహించనున్న కిస్మస్ వేడుకల్లో అంతర్జాతీయ ప్రసంగికులు, మెరకల్ సెంటర్- వైజాగ్ నుంచి శామ్యూల్ కర్మోజీ విచ్చేయనున్నట్టు ఐక్యవేదిక అధ్యక్షుడు ఆనందరావు, గౌరవ అధ్యక్షుడు బాబూరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక సభ్యులు బి.ఆనందరావు, ఓలేసి బాబూరావు, ఎస్. రూబేన్, హాన్సెస్, షెమ్మో, రవి, పట్టాసి భాస్కరరావు, ఎల్‌బీ దయానిధి, లెనిన్‌రాజు, బురిడి ప్రకాశరావు పాల్గొన్నారు

యువకుడిపై పోక్సో కేసు

చింతపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఓ గ్రామంలో బాలికను వంచించిన యువకుడిపై అన్నవరం పోలీసు స్టేషన్‌లో మంగళవారం పోక్సో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. 14ఏళ్ల బాలిక, 19 ఏళ్ల యువకుడు ప్రేమించుకున్నారు. ఈ నేపథ్యంలో శారీకంగా వారు కలవడంతో బాలిక గర్భవతి అయింది. విషయం తెలుసుకున్న ఆమె తండ్రి ఫిర్యాదు చేశారు. ఆ యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు.

జర్రెలపాదర్ గ్రామ రహదారి నిర్మాణానికి కృషి


సమస్యలను అడిగి తెలుసుకుంటున్న వైస్‌ఎంపీపీ భాగ్యవతి

ముంచంగిపుట్టు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారుమూల రంగబయలు పంచాయతీ జర్రెలపాదర్ గ్రామానికి రహదారి పనులు జరిగేలా విశాఖ ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర కృషి చేస్తున్నట్టు వైస్ ఎంపీపీ ఎస్.భాగ్యవతి తెలిపారు. వైస్ ఎంపీపీ ఆ గ్రామానికి సం దర్శించి, గ్రామస్తులతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమ గ్రామానికి పక్కా రహదారి మంజూరైనా పనులు చేపట్టలేదని పలువురు వివరించారు. పలువురికి జన్‌మన్ పథకం ద్వారా గృహాలు మంజూరయ్యాయని, ఈ నిర్మాణాలకు సిమెంట్, ఇటుకలు, ఇసుక తదితర సామ గ్రి తరలించేందుకు ఇబ్బంది ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ పంచాయతీ రాజ్, అటవీ శాఖ అధికారుల సమన్వయ లోపంతో రహదారి పనుల్లో జాప్యం జరిగినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయా శాఖల అధికారులతో జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడారన్నారు. రహదారి పనులు జరిగే విధంగా చూస్తామని ఆమె చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు జేవీవీఎస్ మూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి అరబీరు జగబంధు, పార్టీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు, నేతలు రమేష్, తిరుపతి, దేవ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న సర్పంచి కాసులమ్మ

గూడెంకొత్తవీధి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడిసింగి గ్రామంలో రూ.3 లక్షల పంచాయతీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారు. మంగళవారం ఈ నిర్మాణాలకు సర్పంచ్ వనపల కాసులమ్మ భూమి పూజచేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణంతో త్వరలో గ్రామస్థులు కష్టాలు తీరుతాయన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు జోరంగి సరస్వతి, పంచాయతీ కార్యదర్శి శివ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రమేశ్, వార్డు సభ్యుడు ఝాన్సీ కూటమి నాయకులు సత్తిబాబు, రాజేశ్, ముర్ల కోటేశ్వరరావు, జేఈ జ్యోతిబాబు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై సమాచారం ఇవ్వండి

▸▸ అవగాహన సదస్సులో డీఎస్పీ శ్రావణి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణి

అనకాపల్లి టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న ఓ హోటల్‌లో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఎం.శ్రావణి మాట్లాడుతూ సైబర్ నేరాలు జరిగే విధానం, వాటి నుంచి తప్పించుకోవడం ఎలా.. తదితర అంశాలను వివరించారు. సైబర్ నేరం జరిగిన వెంటనే సుమారు గంట సమయంలోపు పోలీసులకు సమాచారం అందిస్తే పోయిన నగదును తిరిగి తీసుకురావచ్చనని వివరించారు. డిజిటల్ అరెస్టులు, సైబర్ ఫ్రాడ్‌లు గురించి భయపడవద్దని స్పష్టం చేశారు. ఇటువంటి పరిస్థితులు ఎదురైనప్పుడు 1930 ఫోన్ నంబర్‌కు డయల్ చేసి తక్షణ సహాయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారు.

'పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు'

కొత్తూరు : పరిమితికి మించి ప్రయాణికులతో రవాణా చేస్తే చర్యలు తప్పవని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి హెచ్చరించారు. మంగళవారం ఇక్కడ డ్రైవర్లతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. అనకాపల్లి పట్టణ పరిధిలో వాహనాలు అతివేగంగా నడపవద్దన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. పార్కింగ్ స్థలంలో వాహనాలను నిలపనివారి వాహనాలకు, వేగ నిరోధకాలను అమర్చని స్కూల్ బస్సులను సీజ్ చేస్తామన్నారు. డ్రైవర్లంతా జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి మార్షల్ ఆర్ట్స్‌కు 'బాల భారతి' విద్యార్థి



అనీశ్‌తో ప్రిన్సిపాల్ వసంతదేవి

పరవాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మణిపూర్‌లో వచ్చే నెల నిర్వహించనున్న టాంగ్-టా మార్షల్ ఆర్ట్స్ జాతీయ స్థాయి పోటీలకు సింహాద్రి ఎన్టీపీసీ బాల భారతి పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థి అశ్విన్ అనీశ్ ఎంపికయ్యాడు. ఇటీవల అల్లూరి సీతారామ రాజు జిల్లా పాడేరులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అంతర్ జిల్లాల అండర్ -14 విభాగంలో నిర్వహించిన టాంగ్-టా మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో ప్రథమ స్థాయిలో నిలవడంతో జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాడని వ్యాయామ ఉపాధ్యాయుడు షెల్టన్ జేన్స్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థి అశ్విన్ అనీశ్‌ను ప్రిన్సిపాల్ వసంతదేవి, కోచ్ తులసీరామ్ అభినందించారు.

షూటింగ్ బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన జిల్లా క్రీడాకారులు

సబ్బవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అనంతపురం జిల్లా ఈనెల 23 నుంచి 25 వరకూ జరిగిన రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో అనకాపల్లి జిల్లా క్రీడాకారులు ప్రతిభ చూపారు. జిల్లా తరఫున బాలురు, బాలిక జూనియర్స్ సబ్ జూనియర్స్ జట్లు తలపడ్డాయి. జూనియర్స్ విభాగంలో బాలికలు ద్వితీయ స్థానంలో బాలురు, తృతీయ స్థానంలో నిలిచారని షూటింగ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పైలా ప్రవీణ్ తెలిపారు. అలాగే, సబ్ జూనియర్స్ విభాగంలో బాలికలు ప్రథమ స్థానం, బాలురు తృతీయ స్థానంలో నిలిచారని వివరించారు. ఈ సందర్భంగా విజేతలను అభినందించారు

ఒకటిన ఉక్కు పరిరక్షణకు ధర్నా : బీఎస్పీ

తుమ్మపాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బహుజన సమాజ్‌వాది పార్టీ ఆధ్వర్యంలో డిసెంబరు ఒకటో తేదీన కూర్మన్నపాలెంలో జరగనున్న విశాఖ ఉక్కు పరిరక్షణ మహాధర్నాను అంతా విజయవంతం చేయాలని ఆ పార్టీ అనకాపల్లి ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు పిలుపునిచ్చారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటైన ప్రజా సంఘాల నాయకుల రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు. విశాఖ ఉక్కును పరిరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇందుకోసం పోరాటానికి అంతా నడుం బిగించాలన్నారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు విల్లూరి పైడారావు, కొణతాల హరినాథబాబు, బొడ్డేడ అప్పారావు, బొట్టా చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్‌కుమార్, కొల్లి చినఅప్పారావు, బొడ్డు సోమరాజు, కోరిబిల్లి శంకరరావు, బుగిడి అప్పారావు, కొల్లి సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

తుమ్మపాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి అనకాపల్లి పట్టణంలోని గౌరీ గ్రంథాలయంలో డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నామని వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత అధికారిణి కె.రాజేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారంతా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందుకోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ కులాలకు చెందిన అభ్యర్థులుదరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 98858 45743 నంబర్‌లో సంప్రదించాల్సిందిగా కోరారు.

భక్తిశ్రద్ధలతో శూలాల మహోత్సవం



ఉజ్జయిని మహాకాళేశ్వర అఘోర అలంకరణ

అనకాపల్లి టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి చిన రాజుపేటలోని చౌడేశ్వరి సాంబ శివ ఆలయం వద్ద సోమవారం రాత్రి శూలాల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలువురు భక్తులు ఉపవాసాలతో శూలాలు ధరించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన ఊరేగింపులో నేలవేషాలు, చిడతలు, తప్పెట గుళ్లు, ఉజ్జ యిని మహాకాళేశ్వర అఘోర అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కమిటీ అధ్యక్షుడు మావూరి అయ్యప్ప, కార్యదర్శి బాలగురుజీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : సీఐ

కశింకోట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ అల్లు స్వామినాయుడు సూచించారు. బయ్యవరంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటై అవగాహన సదస్సులో మాట్లాడారు. ఇటీవల కాలంలో ఆన్‌లైన్ మోసాలు జరుగుతున్నాయన్నారు. అటువంటి యాప్‌లను సెల్ ఫోన్‌లలో ఇన్‌స్టాల్ చేసుకోకుండా జాగ్రత్త పడాలన్నారు. వ్యక్తిగత సమాచారాన్ని ఆన్‌లైన్‌లో షేర్ చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో ఆన్‌లైన్‌లో నకిలీ యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకుంటారని, ఆ విధంగా చేయడం వల్ల ఖాతాలో ఉన్న డబ్బులను కూడా దోచేసే పరిస్థితి ఉంటుందని వివరించారు. అదే విధంగా వాహనాలు నడిపేటప్పుడు నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మనోజ్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పౌరులందరికీ సమాన హక్కులు

▸▸ రాజ్యాంగ దినోత్సవంలో కలెక్టర్ విజయకృష్ణన్ ▸▸ వాడవాడలా ఘనంగా వేడుకలు ▸▸ అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులు



కలెక్టరేట్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ, డీఆర్వో



జిల్లా పంచాయతీ కార్యాలయంలో డీపీవో శిరీషారాణి తదితరులు...

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగం పౌరులందరికీ సమాన హక్కులు కల్పించిందని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. ఇక్కడి కలెక్టరేట్‌లో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యం సాధనకు, భారతదేశ రూపకల్పనకు ఎందరో మహానుభావులు తమ జీవితాలను త్యాగం చేశారన్నారు. ప్రతి వ్యక్తి స్వేచ్ఛగా బతికేలా వీలు కల్పిస్తూ రాజ్యాంగాన్ని రూపొందించి 1949 నవంబరు 26న అమలులోకి తీసుకువచ్చారన్నారు. రాజ్యాంగంలో వ్యక్తి స్వేచ్ఛ, హక్కులతో పాటు ప్రతి వ్యక్తికి విధులు కూడా పొందుపరిచారని వివరించారు. జాయింట్ కలెక్టర్ జాహ్నవి మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి న్యాయం, సామాజిక, ఆర్థిక, రాజకీయ సంక్షేమ ఫలాలు అందేలా రాజ్యాంగ నిర్మాణం జరిగిందన్నారు. అనంతరం అంతా కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో దయానిధి, కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారిణి బీవీ రాణి తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్ : మండలంలోని రేబాకలో గల జిల్లా పంచాయతీ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటానికి డీపీవో శిరీషారాణి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంబేడ్కర్‌ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. దేశాభివృద్ధి, అన్నివర్గాల వారికి సమానత్వం చేకూరేలా రాజ్యాంగ నిర్మాణం చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో భారతదేశ రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ గెల్లా జయబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగం ఏర్పాటు చేయడంలో ముఖ్య ఘట్టాలను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ టి.నిరంజన్‌కుమార్, సూపరింటెండెంట్ పి.అనురాధ, ఎన్ఎస్ఎస్ అధికారులు ఎ.సూరిబాబు, బుద్ద మహాలక్ష్మీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాల : అనకాపల్లిలోని ఎంపీడీవో కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఎంపీడీవో కేవీ నరసింహారావులు అధికారులతో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి ఉపాధ్యాయులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈవోపీఆర్డీ పీవీవీ ప్రసాద్, ఏవో ఎం.శ్రీనివాసరావు, మామిడిపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కశింకోట : స్థానిక డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ప్రధానోపాధ్యాయుడు ఎం.ఆర్.వి.అప్పారావు విద్యార్థులకు రాజ్యాంగం ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటం వద్ద న్యాయమూర్తి ధర్మారావు నివాళి

చట్టం కంటే నైతిక బాధ్యత గొప్పది

▸▸ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ధర్మారావు

అనకాపల్లి టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : చట్టం కంటే నైతిక బాధ్యత గొప్పదని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గోరంట్ల ధర్మారావు అన్నారు. స్థానిక దైట్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం జరిగిన రాజ్యాంగ దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. భారత రాజ్యాంగపు విశిష్టత, అందించిన హక్కులను వివరించారు. సమానత్వం, విశ్వసనీయత, న్యాయం అనే మూడు సూత్రాలు ముఖ్యమైనవని, ఇవి రాజ్యాంగానికి మూల స్తంభాలని వివరించారు. సమాజంలో ప్రతి వ్యక్తికి సమానమైన హక్కులు, అవకాశాలు కల్పించడం జరిగిదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.మోహనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరవాడ : సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన ఇంటక్ ఆధ్వర్యంలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంజేపీ లెనిన్, జనరల్ సెక్రటరీ భీమరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

సబ్బవరం : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంపీడీవో పి.పద్మజ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతామని అధికారులు, ప్రజాప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయించారు. అలాగే, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాలతో పాటు సచివాలయాల్లో ఈ వేడుకలను జరిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ బోకం సూర్యకుమారి, సర్పంచ్‌లు గండి అరుణ, ఆకుల శ్రీహేమ, దాడి లావణ్య, బుదిరెడ్ల శ్రీలక్ష్మి, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి, హెచ్ఎం తిరపతిరావు తదితరులు పాల్గొన్నారు.



అనకాపల్లిలో ఎంపీడీవో కార్యాలయంలో...



కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాలలో...



ఎన్టీపీసీకి చెందిన ఇంటక్ కార్యాలయంలో...



సబ్బవరం ఎంపీడీవో కార్యాలయంలో...

కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలపై వామపక్షాల ఆందోళన

▸▸ ప్రజల కంటే కార్పొరేట్ శక్తులకే ప్రాధాన్యం ▸▸ సర్కారు తీరును ఎండగట్టిన నాయకులు ▸▸ సమస్యల పరిష్కారానికి నినాదాలు



ఆందోళనలో మాట్లాడుతున్న సంయుక్త కిసాన్‌మోర్చ కన్వీనర్ సూర్యనారాయణ

అనకాపల్లి టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వామపక్షాలు మంగళవారం పట్టణంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాయి. తొలుత సీఐటీయూ కార్యాలయం నుంచి ర్యాలీగా నెహ్రూచౌక్‌కు చేరుకుని మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సంయుక్త కిసాన్‌మోర్చ కన్వీనర్ ఎం.సూర్యనారాయణ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా రైతు వ్యతిరేక విధానాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. మోదీ ప్రభుత్వం కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకువచ్చిందని, దీని వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకుండా ఉందని, కౌలు రైతులు రుణాలు పుట్టక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు స్వరాజ్య వేదిక కన్వీనర్ గాడి బాలు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ వర్గానికి మేలు జరగలేదన్నారు. ప్రజల కంటే కార్పొరేట్ శక్తులకే కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని ఆరోపించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.దొరబాబు, సీపీఐ జోనల్ సెక్రటరీ వైఎన్ భద్రం, గొర్రెలు మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంటా శ్రీరామ్, డి.వెంకన్న, వరలక్ష్మి, వీవీ శ్రీనివాసరావుతో పాటు పలువురు వామపక్ష, సీఐటీయూ, ఏఐటీయూసీ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

9న బీమా ఏజెంట్ల సమస్యలపై ధర్నా

▸▸ ఏవోఐ డివిజన్ అధ్యక్షుడు నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న డివిజన్ అధ్యక్షుడు నాగరాజు

కొత్తూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జీవిత బీమా ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలని ఎల్ఐసీ ఏజెంట్ల ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఏవోఐ) డివిజన్ అధ్యక్షుడు ఎం.నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. జీవిత బీమా ఏజెంట్ల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డివిజన్ కార్యాలయం వద్ద డిసెంబరు తొమ్మిదో తేదీన మహాధర్నా జరగనుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఐఆర్డీఏను అడ్డుపెట్టుకొని ఎల్ఐసీలో తీసుకొస్తున్న హానికరమైన మార్పులను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా అన్ని డివిజన్ కార్యాలయాల వద్ద ధర్నా చేయాలని కేంద్ర కమిటీ పిలుపునిచ్చిందన్నారు. ఇన్సూరెన్స్ పాలసీపై ఉన్న జీఎస్టీని తొలగించాలని, గ్రాడ్యుటీపై సీలింగ్ రద్దు చేసి ఎల్ఐసీ హెల్త్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఏజెంట్లకు ఈఎస్ఐ, ఈపీఎస్ సౌకర్యం కల్పించాలని కోరారు. డిమాండ్ల పరిష్కారానికి దేశవ్యాప్తంగా దశలవారీ పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. అనకాపల్లి బ్రాంచ్ ఏఓఐ యూనియన్ అధ్యక్షుడు పెంటకోట సైదునాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్టేట్ కమిటీ సభ్యులు గొర్లి శంకరరావు, కె.వి.రమణ, చోడవరం బ్రాంచ్ ట్రెజరర్ ఎస్.శ్రీనివాసరావు, రెసిడెన్షియల్ కార్యదర్శి పి.నూకరాజు, సీనియర్ డివిజన్ నాయకులు పీలా శ్రీనివాసరావు, రూరల్ జిల్లా అధ్యక్షుడు రమణబాబు, ఈశ్వరరావు, అనకాపల్లి బ్రాంచ్ కార్యదర్శి మాణిక్యాలరావు, నర్సీపట్నం బ్రాంచ్ కార్యదర్శి శ్రీరామ్మూర్తి, ఎలమంచిలి బ్రాంచ్ అధ్యక్షుడు అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

ఉత్సాహంగా జిల్లాస్థాయి ఆర్చరీ పోటీలు

పరవాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఆర్చరీ సంఘం ఆధ్వర్యంలో ఇక్కడి సంస్కృతి గ్లోబల్ స్కూల్ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి సీనియర్ ఆర్చరీ పోటీలు ఘనంగా ముగిశాయి. తొలుత ఈ పోటీలను పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి ప్రారంభించగా జిల్లా నలుమూలల నుంచి సుమారు 30 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ రౌండ్ విభాగాలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు వచ్చే నెల మూడు నుంచి ఐదో తేదీ వరకు విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని విశాఖ జిల్లా ఆర్చరీ ప్రధాన కార్యదర్శి కె.నిశాంత్ తెలిపారు. ఎల్.సూరిబాబు, కె. గోవింద్, వి.శివకుమార్ పోటీలకు కోచ్‌లు వ్యవహరించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జట్లు

బైరాగి నాయుడు, సుధాకర్ నాయుడు, సాయికృష్ణమనాయుడు, యశ్వంత్ నాయుడు, సాయి మనస్వి, సాహితీ, చిన్మయ్ శ్రీజ, వైష్ణవి, ఆద్య, అరియానా, గణేష్ మణిరత్నం, హర్షవర్ధన్, సాయికృష్ణమరాజు, గణేష్ నాయక్, సాంబశివ, ప్రశాంత్, హరీష్ చంద్ర, గౌతమ్ బుద్ధదేవ్‌లు ఉన్నారు. వీరిని జిల్లా ఆర్చరీ సంఘం ఉపాధ్యక్షులు సత్యనారాయణ అభినందించారు.

రాంకీ యాజమాన్యం అదనపు ల్యాండ్‌ఫిల్ ఏర్పాటు ఊరుకోం

▸▸ హెచ్చరించిన తాడి గ్రామస్థులు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ మాదంశెట్టి నీలబాబు

పరవాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాంకీ యాజమాన్యం అదనపు ల్యాండ్‌ఫిల్ ఏర్పాటు చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదని తాడి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ మాదంశెట్టి నీలబాబు హెచ్చరించారు. తాడి గ్రామాన్ని తరలించాకే ల్యాండ్‌ఫిల్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మంగళవారం స్థానిక బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాడి రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 116లో రాంకీ యాజమాన్యం ఫార్మా ఘన వ్యర్థాలను నిల్వ చేసేందుకు అదనపు ల్యాండ్‌ఫిల్‌ను ఏర్పాటు చేయాలని చూస్తుందన్నారు. దీనిని తామంతా వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు. ఇదే విషయమై ల్యాండ్‌ఫిల్‌కు వ్యతిరేకంగా కోర్టులో కేసు వేశామని తెలిపారు. ల్యాండ్‌ఫిల్ ఏర్పాటు కోసం గతంలో ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయసేకరణ సమావేశంలో కూడా తామంతా ముక్తకంఠంతో వ్యతిరేకించామని వివరించారు. మాజీ సర్పంచ్ బొడ్డపల్లి అప్పారావు మాట్లాడుతూ తాడి గ్రామాన్ని తరలించే వరకు అదనపు ల్యాండ్‌ఫిల్ నిర్మాణాన్ని అడ్డుకుంటామని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు హామీ ఇచ్చారని ఆయన వెల్లడించారు. ఎమ్మెల్యేపై తమకు నమ్మకం ఉందన్నారు. తాడి తరలింపు ప్రక్రియ తొందర్లోనే ప్రారంభమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తాడి గ్రామానికి చెందిన కూటమి నాయకులు కోమటి సూరిబాబు, జుత్తక మాధవరావు, గనిరెడ్డి కనకరాజు, దానబోయిన నీలకంఠరావు, గొల్లవిల్లి నాగరాజు, గుర్రం నాయుడు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామికి అభిషేకాలు



స్వామికి పాలాభిషేకం చేస్తున్న సీఐ విజయ్‌కుమార్

అనకాపల్లి టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో గౌరీ హోల్‌సేల్ కూరగాయల వర్తక సం ఘం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ స్వామి వారికి పాలాభిషేకం చేశారు. అనంతరం దీపాలంకరణను ప్రారంభించారు. ఓంకారం, శివలింగం, త్రిశూలం వంటి దీపాలంకరణలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సంఘం అధ్యక్షుడు మళ్ల జగ్గఅప్పారావు, కార్యదర్శి కాండ్రేగుల ఆదినారాయణలతో పాటు భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల కల్యాణం



కల్యాణాన్ని జరిపిస్తున్న పురోహితులు

అనకాపల్లి టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెంలో కొలువుదీరిన పీలా వారి గౌరీ పరమేశ్వరుల కల్యాణం సోమవారం రాత్రి నేత్రపర్వంగా సాగింది. బొడ్డేడ సత్యదేవ్ దంపతులు, భీమరశెట్టి శ్రీనివాసరావు దంపతులు, భీమరశెట్టి లక్ష్మీనారాయణ దంపతులు వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ కల్యాణం చేయించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

ట్రాఫిక్‌ను నియంత్రించాలని సీఐకు వినతి

అనకాపల్లి టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో రోజు రోజుకి పెరుగుతున్న ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ విల్లూరి పైడారావు ట్రాఫిక్ సీఐ ఎం.వెంకట నారాయణను కోరారు. ఈ మేరకు మంగళవారం ప్రజా సంఘాల నాయకులతో కలిసి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సీఐను కలిసి పలు సమస్యలను వివరించారు. పార్కింగ్ పేరుతో సామాన్యులపై కేసులు పెట్టవద్దన్నారు. మెయిన్ రోడ్డులో వ్యాపారవాణిజ్య సముదాయాలకు వచ్చే కొనుగోలుదారుల వాహనాలను సెల్లార్లలో నిలుపుకునే విధంగా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

దుర్గామాతకు అర కిలో వెండి బహూకరణ



ఆలయ ప్రతినిధులకు వెండిని అందిస్తున్న సీఐ రమణ

సబ్బవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి దుర్గాలమ్మ ఆలయానికి సబ్బవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పిన్నింటి రమణ మంగళవారం అర కిలో వెండిని బహూకరించారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దంగేటి నానిబాబు, బర్ల రమణ, కొరాడ శ్రీను, కనకరాజు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సేవా వారధులు


రాబిన్ హుడ్ ఆర్మీ వలంటీర్లు

పేదలు, దాతలకు వారధిగా 'రాబిన్‌హుడ్ ఆర్మీ'

- ఉపాధి, ఉద్యోగ రంగాల్లో ఉంటూనే సేవ
- నగరంలో ఎనిమిదేళ్లుగా కార్యకలాపాలు


విద్యావసర సరకుల పంపిణీలో...

సేవ చేయాలనే ఆలోచన ఉంటే చాలదు. దానిని అమలుచేసే విధానమూ తెలియాలి. పేదలకు ఆహారం, సరకులు తదితరాలు అందించాలని ఉన్నా...సమయం, తీరిక లేక ఎంతోమంది ఇబ్బంది పడుతుంటారు. అలాంటి వారి కోరిక తీర్చి పేదలు-దాతలకు మధ్య వారధిగా నిలుస్తున్నారు రాబిన్ హుడ్ ఆర్మీ వలంటీర్లు. ఎప్పుడు, ఎలా, ఏ సాయం అందివ్వాలనుకుంటున్నారో మీ ఆలోచనలు వారితో పంచుకుంటే చాలు...వారే మీ వద్దకు వచ్చి సహాయపడతారు. విభిన్న ఆలోచనలతో గత ఎనిమిదేళ్లుగా నగరంలో ఉత్తమ సేవలందిస్తున్నారు.


వృద్ధులకు అన్నం వడ్డిస్తున్న వలంటీర్లు

సేవ చేయాలనే మనసుంటే చాలు..ఆస్తిపాస్తులతో పనిలేదని నిరూపించారు నగరంలోని కొంతమంది యువత. విభిన్న రంగాల్లో స్థిరపడి, సమాజంలో గౌరవప్రదమైన ఉద్యోగాలు చేస్తూనే పేదలు-దాతలకు మధ్య వారధిగా నిలుస్తున్నారు. రాబిన్ హుడ్ ఆర్మీ పేరిట వలంటీర్లుగా ఉత్తమ సేవలతో భవిష్యత్తు తరానికి మార్గనిర్దేశనం చేస్తున్నారు. విధులను నిర్వర్తిస్తూనే ఖాళీ సమయాన్ని సమాజానికి అంకితం చేస్తున్నారు. నిరుపేదలు, నిర్భాగ్యులు, అనాథలకు సేవలందించాలనే సత్సంకల్పంతో విశాఖ కేంద్రంగా రాబిన్ హుడ్ ఆర్మీ ఏర్పాటు చేశారు. ఇందులో వివిధ రంగాల్లోని వారు వలంటీర్లుగా చేరి సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సభ్యుల్లో ఐదుగురు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ముగ్గురు వైద్యులు, ఇద్దరు టీచర్లు ఉన్నారు. ప్రస్తుతం ఇరవై మంది వలంటీర్లుగా పనిచేస్తున్నారు. దాతల నుంచి విరాళాలు సేకరించి, పేదలకు ఆహారాన్ని అందిస్తున్నారు. అంతేకాదు ఎవరైనా తమ కుటుంబసభ్యుల పుట్టినరోజులు, ఇతర కార్యక్రమాల సందర్భంగా పేదలకు భోజనం అందివ్వాలని భావిస్తే వారికి సహాయపడుతున్నారు. బుల్లితెర యాంకర్ రష్మీ ఇటీవల తన తాత వర్ధంతి సందర్భంగా అన్నదానం చేసేందుకు సంకల్పించింది. ఇందుకోసం రాబిన్‌హుడ్ ఆర్మీ వలంటీర్లను సంప్రతించి, వారి సేవలను వినియోగించుకుంది.

చిన్నారులకు బోధనలోనూ...

ఓల్డేజ్ హోంలు, అనాథాశ్రమాలకు దుప్పట్లు, ఇతర సరకులు పంపిణీ, ఆకలితో అలమటించే వారికి భోజనం అందించడమే కాకుండా పాఠశాలకు దూరంగా ఉన్న నిరుపేద చిన్నారులకు అక్షరాలను నేర్పడంలోనూ వలంటీర్లు ముందున్నారు. ఆర్మీలో వలంటీర్లుగా పనిచేస్తున్న టీచర్లు ఏపీఎస్ కళాశాల ఏరియా, తాటిచెట్లపాలెం, తదితర ప్రాంతాల్లో పేద పిల్లలకు తరగతులు నిర్వహిస్తున్నారు. అవసరమైన పుస్తకాలు, సామగ్రి అందించి మరీ సెలవు దినాల్లో పాఠాలు బోధిస్తున్నారు.


యాచకుడి ఆకలి తీర్చుతున్న వలంటీర్

సోషల్ మీడియా వేదికగా...

రాబిన్‌హుడ్ వలంటీర్ల సేవలు వినియోగించుకోవాలనుకునే వారు సోషల్ మీడియా వేదికగా వారిని సంప్రతిస్తున్నారు. పేదలకు భోజనాలు, ఇతర సరకులు, తదితరాలు అందించాలనుకునే వారు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వలంటీర్లను సంప్రదించి, తేదీ చెబితే ఆరోజు సంబంధిత ప్రదేశానికి చేరుకుని, పేదలకు పంపిణీ చేస్తారు. అంతేకాదు నగరంలోని హోటల్స్, ఇతర శుభకార్యక్రమాల్లో మిగిలిపోయిన ఆహారాన్ని సేకరించి రోడ్డు పక్కన అభాగ్యులకు అందిస్తారు. వలంటీరుగా పనిచేస్తున్న ఇమ్రాన్ తన సొంత డబ్బుతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

- మద్దిలపాలెం, ఆంధ్రజ్యోతి

లెక్చరర్‌గా చేస్తూనే...



పేదలకు సాయం చేయాలనే తపనతో వలంటీరుగా చేరాను. విరాళాలు సేకరించి, పేదల అవసరాలు తీర్చడం, దాతల వద్ద భోజనాలు సేకరించి అనాథలకు పెట్టడం అలవాటుగా మారింది. లెక్చరర్‌గా పనిచేస్తూ ఖాళీ సమయాల్లో వలంటీరుగా సేవలందిస్తున్నా. దీనికి నా భర్త హరికృష్ణ పూర్తిగా సహకరించడమే కాకుండా తాను కూడా వలంటీరుగా చేరారు. - ఎం.రేణుక, లెక్చరర్

డోనర్‌గా వచ్చి వలంటీరుగా..



రాబిన్‌హుడ్ ఆర్మీ వలంటీర్ల సేవలకు నాకు తోచిన విధంగా విరాళాలు ఇచ్చాను. అయితే సేవల్లో స్వయంగా పాల్గొనాలనే ఆసక్తితో వలంటీరుగా మారిపోయాను. అబుదాబీలో పనిచేస్తూ రెండు, మూడు నెలలకో సారి నగరానికి వస్తాను. ఇక్కడ విద్యార్థులకు పాఠశాల ఫీజులు చెల్లించడం, వ్యాధులతో బాధపడే వారికి, పేదలకు విరాళాలిస్తుంటారు. అయితే నా చేతులతో వారి అవసరాలు తీర్చడం మానసిక ఆనందాన్ని ఇస్తోంది.
- ఇమ్రాన్, ప్రైవేటు ఉద్యోగి

తెలుగు పండిట్‌గా పనిచేస్తూనే...



అనకాపల్లి ప్రభుత్వ పాఠశాలలో తెలుగు పండిట్‌గా పనిచేస్తున్నా. పాఠశాల ముగిశాక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నాను. పేదలను ఆదుకునే సమయంలో వారు చూపించే ఆప్యాయత సేవ చేయాలనే దృక్పథాన్ని మరింత పెం చింది. సెలవురోజుల్లో పేద పిల్లలకు పాఠాలు బోధించడం ద్వారా ఉపాధ్యాయ వృత్తికి మరింత న్యాయం చేశాననే సంతృప్తి కలుగుతోంది. - సంజీవ్‌కుమార్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

కిరండోల్ రైలుకు అదనపు విస్టాడోమ్ కోచ్

విశాఖపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం-కిరండోల్-విశాఖపట్నం రైలుకు రద్దీ ఎక్కువగా ఉన్న కారణంగా అదనపు విస్టా డోమ్ కోచ్ ఏర్పాటు చేస్తున్నట్టు వాల్తేరు డివిజన్ అధికారులు మంగళవారం తెలిపారు. విశాఖపట్నం నుంచి కిరండోల్ వెళ్లే రైలు (08551)కు డిసెంబరు 5, 7, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25, 27, 29, 31 తేదీల్లో అదనపు కోచ్ అందుబాటులో ఉంటుంది. అటు నుంచి కిరండోల్ నుంచి విశాఖ వచ్చే రైలు (08552)కు డిసెంబరు 6, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26, 28, 30, జనవరి 1వ తేదీలలో అదనపు కోచ్ ఉంటుంది.

50 క్వార్టర్ మద్యం బాటిళ్లతో ఒకరి అరెస్టు

అనకాపల్లి టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాక గ్రామానికి సమీపంలో ఉన్న కళాశాల వద్ద మద్యం అక్రమంగా అమ్మకాలు చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వైఎల్ నాయుడు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సోమవారం సాయంత్రం సదరు ప్రాంతంలో సిబ్బందితో దాడి చేశామన్నారు. ఈ సందర్భంగా గొరపల్లి మహాలక్ష్మినాయుడు అనే వ్యక్తి నుంచి యాభై క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు చెప్పారు.

ఐపీఎల్‌లో దోసూరు కుర్రాడు

... 5వ పేజీ తరువాయి

సత్యారావు కొంతకాలం పాన్‌షాపు నడిపారు. అవినాశ్‌కు నాలుగేళ్ల వయసున్నప్పుడు పిల్లల చదువు నిమిత్తం 2004లో గాజువాకకు మకాం మార్చారు. సత్యారావు అబుదబీ వెళ్లి కొంతకాలం పనిచేసి వచ్చారు. అక్కడ సంపాదించిన డబ్బులతో పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. పిల్లలిద్దరికీ క్రికెట్ అంటే ప్రాణం. పెద్ద కుమారుడు చరణ్‌తేజ్ బీటెక్ వరకు చదువుకున్నారు. అండర్-16 ఏపీ జట్టుకు మూడుసార్లు ఎంపిక అయినప్పటికీ ఆడే అవకాశం రాకపోవడంతో విసిగిపోయి ఉన్నత చదువుల కోసం లండన్ వెళ్లిపోయాడు. రెండో కుమారుడు అవినాశ్ ఎంబీఏ పూర్తి చేసి, క్రికెట్‌లోనే సత్తా చాటాలని భావించాడు. 2021లో ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) టీమ్‌కు ఎంపికై బెజవాడ టీమ్ తరఫున ఆడాడు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌తోపాటు మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌కు ఎంపికయ్యాడు. ఇతని ప్రతిభను గుర్తించిన కింగ్స్ ఎలెవెన్ పంజాబ్ యాజమాన్యం ఐపీఎల్-2025 వేలంపాటలో రూ.30 లక్షలకు పాడుకున్నది. ఈ సందర్భంగా అవినాశ్ తండ్రి సత్యారావు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ, గతంలో ఆర్థిక ఇబ్బందుల కారణంగా క్రికెట్ ప్రాక్టీసు కోసం నెలకు రూ.1,500 చొప్పున ఇవ్వలేక పోయానని, అయితే తన ఇద్దరు పిల్లల ప్రతిభను చూసి ఒకరికి ఉచితంగా గ్రౌండ్ ఇచ్చారని గుర్తు చేసుకున్నారు. అవినాశ్ క్రికెట్‌లో రాణిస్తుంటే, చరణ్‌తేజ్ లండన్‌లో చదువు పూర్తి చేసుకుని ఉద్యోగంలో చేరాడని, కొడుకులు అందివచ్చిన తరువాత ఆర్థిక కష్టాలు తొలగిపోయాయని చెప్పారు.

తాండవ రైతులు శ్రమదానం

... 5వ పేజీ తరువాయి

కాలువల్లో నిర్వహణ పనులు చేపడతామని అధికారులు చెప్పగా.. ఎండిపోతున్న వరి పంటను కాపాడుకునేందుకు ఎనిమిది గ్రామాల రైతులు శ్రమదానంతో కాలువలో నాచు తొలగించడానికి నడుం బిగించారు. ఈ విషయాన్ని తాండవ ప్రాజెక్టు అధికారులకు తెలియపరిచి ఒక రోజుపాటు కుడి కాలువకు నీటి విడుదలను ఆపాలని కోరారు. దీంతో సోమవారం సాయంత్రం కాలువకు నీటి విడుదలను నిలుపుదల చేశారు. మంగళవారం ఉదయం పి.జగ్గంపేట, పీకేగూడెం, కేఈ చిన్నయ్యపాలెం గంగవరం తదితర ఎనిమిది గ్రామాలకు చెందిన రైతులు వ్యసాయ పనిముట్లతో వచ్చి తాండవ కుడి కాలువ 1.4 కిలోమీటరు నుంచి 2.5 కిలోమీటరు వరకు కాలువలో పేరుకుపోయిన నాచు, జమ్మును స్వచ్ఛందంగా తొలగించారు. తాండవ ఏఈ నాగబాబు, లష్కర్లు తమ వంతు సహకారం అందించారు. కాలువల్లో మూడేళ్ల నుంచి నాచు, పూడిక తీయకపోవడం వల్ల చివరనున్న తమ భూములకు నీరు సరిగా అందడం లేదని రైతులు వాపోతున్నారు. వచ్చే ఏడాది ఖరీఫ్‌లో ఈ సమస్య తలెత్తకుండా వుండడానికి ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ముగిసిన వెంటనే కాలువల్లో నిర్వహణ పనులు చేపట్టాలని ఆయకట్టు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రహదారుల నిర్మాణమే లక్ష్యం

- రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ నూతన చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు
- ప్రజాప్రతినిధుల సమక్షంలో విజయవాడలో ప్రమాణస్వీకారం


ప్రగడ దంపతుల సత్కారంలో మంత్రి జనార్దన రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్ తదితరులు

ఎలమంచిలి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా రహదారుల నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు స్పష్టం చేశారు. విజయవాడలోని రహదారులు, అభివృద్ధి కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం ఉదయం మంత్రి బీసీ జనార్ధనరెడ్డి సమక్షంలో చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లు నిర్మించడమే తన లక్ష్యంగా పేర్కొన్నారు. ఇంతటి బాధ్యతను తనపై ఉంచిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖా మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి నేతలు, కార్యకర్తల అందరితో కలిసి ముందుకు సాగుతానన్నారు. అనంతరం మంత్రి జనార్ధనరెడ్డి తదితరులు నాగేశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. పలువురు నేతలు పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ కుమార్, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, మాజీ ఎమ్మెల్సీలు పప్పల చలపతిరావు, బుద్ద నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ నేత ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ, టీడీపీ రాష్ట్ర ప్రతినిధి కర్రి సాయి కృష్ణ, రాష్ట్ర కార్యదర్శులు రాజాన రమేశ్, ధూళి రంగ నాయకులుతో పాటు నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు, సన్నిహితులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కలుషిత ఆహారం తిని ఐదుగురికి అస్వస్థత

- ధర్మవరం అగ్రహారంలో ఘటన
- కేజీహెచ్‌కు ఇద్దరు తరలింపు



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న అడపా లోవ, సేనాపతి లక్ష్మి (ఇన్‌సెట్‌లో) ధర్మవరం అగ్రహారంలో అడపా లోవ ఇంటి నుంచి ఉప్మా శాంపిళ్లు

ఎస్.రాయవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారం గ్రామంలో కలుషిత ఆహారం తినడంతో ఐదువురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఇద్దర్ని విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించగా, ముగ్గురు అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి క్షతగాత్రుడు చిరంజీవి పోలీసులకు అందించిన వివరాలిలా ఉన్నాయి.

ఎలమంచిలి మండలంలోని పులపర్తి గ్రామానికి చెందిన సేనాపతి చిరంజీవి తన అత్తగారి గ్రామమైన ధర్మవరం అగ్రహారంలో సోమవారం నూకాలమ్మ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన బోనాల పండగలో పాల్గొనేందుకు భార్య లక్ష్మితో పాటు ఇద్దరు కుమార్తెలు నిఖిత, పల్లవితో కలిసి వెళ్లారు. పండగ అనంతరం సోమవారం రాత్రి అత్త అడపా లోవ ఉప్మా వండడంతో చిరంజీవి, భార్య లక్ష్మి, ఇద్దరి కుమార్తెలతో పాటు అత్త లోవ కూడా తిన్నారు. అర్ధ రాత్రి సుమారు 12 గంటల తరువాత ఒక్కసారిగా వారికి ఫిట్స్ వచ్చినట్టు అనిపిస్తూ అస్వస్థతకు గురయ్యారు. దీంతో మంగళవారం ఉదయం లోవ, లక్ష్మి, చిరంజీవితో పాటు లిఖిత, పల్లవిని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో లోవ, లక్ష్మి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. చిరంజీవి, చిన్నారులు లిఖిత, పల్లవి ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఉప్మా కలుషితం కారణంగానే ఐదుగురు అస్వస్థతకు గురైనట్టు వైద్యులు నిర్ధారించారని, ఉప్మాలో ఏమి కలిసిందనేది తెలియలేదని బాధితులు, గ్రామస్థులు తెలిపారు. ఇదిలావుంటే పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ధర్మవరం అగ్రహారంలో క్షతగ్రాతుల ఇంటికి వెళ్లి అక్కడ బయట పడేసిన ఉప్మా శాంపిళ్లతో పాటు ఉప్మా తయారీకి వాడిన నూక, పెరుగును సేకరించి తీసుకువెళ్లారు.

అవినీతి అనకొండ

... 5వ పేజీ తరువాయి

ప్రకారం రూ.రెండు కోట్లు కాగా, మార్కెట్ విలువ ప్రకారం రూ.25 కోట్లు పైనే ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేస్తున్నారు.

ఆది నుంచి వివాదాస్పదమే

సింహాచలం పనితీరు మొదటి నుంచి వివాదాస్పదంగా ఉండేదని జీవీఎంసీ అధికారులు కొందరు చెబుతున్నారు. నాలుగేళ్ల కిందట జోన్-5 (జ్ఞానాపురం) కమిషనర్‌గా పనిచేసినప్పుడు తప్పుడు పత్రాలతో ఆస్తి పన్ను అసెస్‌మెంట్‌లు జారీచేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ వ్యవహారంలో పెద్దఎత్తున ముడుపులు అందాయని ప్రచారం జరిగింది. అలాగే జోనల్ కార్యాలయంలో తన ఛాంబర్ ఆధునికీకరణ పేరుతో పెద్దఎత్తున చందాలు వసూలు చేశారని ఫిర్యాదులు వచ్చాయి. వీటన్నింటిపై పత్రికల్లో కథనాలు రావడంతో ఆయన్ను విజయనగరం జిల్లా పార్వతీపురం మునిసిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు.

వైసీపీ ప్రభుత్వంలో తనకున్న పలుకుబడిని ఉపయోగించుకుని ఆయన కొద్దిరోజులకే తిరిగి జీవీఎంసీకి బదిలీ చేయించుకుని జోన్-6 (గాజువాక) కమిషనర్‌గా పోస్టింగ్ తెచ్చుకున్నారు. అక్కడ పనిచేస్తున్నప్పుడు పరిశ్రమలు సామాజిక బాధ్యత కింద గాజువాక ప్రాంతంలో ఖర్చు పెట్టాల్సిన నిధులను జీవీఎంసీ ఖాతాకు కాకుండా తన వ్యక్తిగత ఖాతాలో డిపాజిట్ చేయించుకోవడం వివాదాస్పదమైంది. దీనిపై పత్రికల్లో కథనాలు రావడంతో జీవీఎంసీ ఉన్నతాధికారులు విచారణ జరిపారు. కానీ తనకున్న పలుకుబడిని ఉపయోగించుకుని ఆ వివాదం నుంచి బయటపడ్డారు. క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లినప్పుడు నిర్మాణంలో ఉన్న భవనాలు కనిపిస్తే వాటి వద్దకు వెళ్లి ప్లాన్‌ను ఉల్లంఘించి నిర్మాణం చేస్తున్నారని, వాటిని కూల్చేయాలంటూ హడావుడి చేసి భారీగా డబ్బులు గుంజేవారనే ఆరోపణలు ఉన్నాయి.

రెవెన్యూ విభాగంలో పనిచేసే ఉద్యోగులను అక్రమాలకు పాల్పడుతున్నారని బెదిరించడం, పన్నులు సరిగా వసూలు చేయలేకపోతున్నారని వేధించడం ద్వారా వారి నుంచి నెలవారీ మామూళ్లు గుంజేవారంటారు ఎన్నికలకు ముందు సింహాచలంను వేరే జిల్లాకు బదిలీ చేయగా, కొత్త ప్రభుత్వం ఏర్పాటుకాగానే తిరిగి జీవీఎంసీకి రావడానికి ప్రయత్నాలు మొదలెట్టారు.

కూటమికి చెందిన నగర ప్రజా ప్రతినిధులను కలిసి పైరవీలు ప్రారంభించారు. వారిని ప్రసన్నం చేసుకునేందుకు బహుమతులు ఇవ్వజూపారనే ప్రచారం జరిగింది. కానీ కూటమి నేతలు పలువురు సింహాచలానికి జీవీఎంసీలో పోస్టింగ్ ఇప్పించేందుకు విముఖత వ్యక్తంచేశారు. అయినప్పటికీ పట్టువదలని విక్రమార్కుడిలా కూటమిలో ఒక సీనియర్ ప్రజా ప్రతినిధిని కలిసి వారి కుటుంబ సభ్యులకు భారీ మొత్తంలో ముడుపులు ఇచ్చి జోన్-2 కమిషనర్‌గా పోస్టింగ్ దక్కించుకున్నారని ప్రచారం జరిగింది. సింహాచలం అక్రమాస్తులపై అతని వద్ద పనిచేస్తూ వేధింపులకు గురైన సిబ్బందే ఏసీబీకి సమాచారం ఇచ్చి ఉంటారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

క్రైం... crime news

ఆటో బోల్తా... డ్రైవర్ మృతి


దిలీప్‌కుమార్ (ఫైల్ ఫొటో)

అనంతగిరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదబిడ్డ- గుమ్మ రోడ్డు ఈతమానవలస గ్రామ సమీపంలో ఆటో అదుపు తప్పి బోల్తాపడిన ఘటనలో యువకుడు మృతిచెందాడు. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలివి. పెదబిడ్డ పంచాయతీకి చెందిన ఆటో డ్రైవర్ సాలెపు దిలీప్‌కుమార్ (27) సోమవారం అర్ధరాత్రి బందవలస నుంచి పెదబిడ్డ ఆటోను డ్రైవ్ చేసుకుంటూ వెళుతున్నాడు. ఈతమానవలస సమీపంలోకి వెళ్లేసరికి ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో దిలీప్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతగిరి ఎస్‌ఐ డి.శ్రీనివాసరావు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

వ్యాపారి అదృశ్యంపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని మూలపేట గణేష్‌నగర్ వీధికి చెందిన వ్యాపారి అదృశ్యమైనట్టు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలివి. గణేష్‌నగర్ వీధికి చెందిన అయితా రమేష్ పట్టణంలో కిరాణా షాపు నిర్వహిస్తున్నారన్నారు. అప్పులు ఉండడంతో తీర్చలేని పరిస్థితిలో సోమవారం సాయంత్రం ఎలమంచిలిలోని తన అక్క ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు అతని భార్య తులసీ ఫిర్యాదు చేశారన్నారు. అయితే రమేష్ ఎలమంచిలి కూడా వెళ్లలేదని, సెల్‌ఫోన్ స్విచాఫ్ చేసి ఉందని ఎస్‌ఐ వివరించారు. కేసు దర్యాప్తులో ఉన్నట్టు చెప్పారు.

అడవిపంది దాడి.. గొర్రెల కాపరి మృతి


అడవిపంది దాడి చేయడంతో మృతిచెందిన నాగేశ్వరరావు

నాతవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అడవి పంది దాడి చేయడంతో గొర్రెల కాపరి మృతి చెందాడు. శృంగవరం శివారు పెడిమికొండ సమీపంలో జరి గిన ఈ సం ఘటనకు సంబంధించి పోలీసులు అందించిన వివరాలిలా వున్నాయి. ఉన్న తాండవకాలువ గట్టుకు సమీపంలో మేతకు తీసుకెళ్లాడు మండ లంలోని శృంగవరం గ్రామానికి చెందిన నీలి నాగేశ్వరరావు (62) గొర్రెల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. రోజూ మాదిరిగానే మంగళవారం ఉదయం గొర్రెల మందను పెడిమికొండకు దగ్గరలో ఉన్న తాండవ కాలువ గట్టుకు సమీపంలో మేతకు తీసుకెళ్లాడు. కొద్దిసేపటి తరువాత అడవి పంది అతనిపై దాడి చేసింది. దాని బారి నుంచి తప్పించుకునేందుకు నాగేశ్వరరావు విఫలయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. ఇదే సమయంలో నాగేశ్వరరావు కుమారుడు దుర్గ అక్కడకు వచ్చాడు. అడవి పందిబారి నుంచి తండ్రిని కాపడడానికి ప్రయత్నించగా, అతనిపైనా దాడికి యత్నించింది. దీంతో అతను తప్పించుకుని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు చెప్పాడు. వారు ఈ విషయాన్ని వీఆర్వో యశ్వంత్ ద్వారా అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామస్థులతో పాటు అటవీ అధికారి రామకృష్ణ, సెక్షన్ అధికారి చిరంజీవి సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. నాగేశ్వరరావు తీవ్రగాయాలతో మృతిచెందాడు. ఎస్‌ఐ భీమరాజు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు.

కేజీబీవీల్లో ఉపాధ్యాయులకు ఎంటీఎస్ ఇవ్వాలి

- పీఆర్‌టీయూ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్

నర్సీపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఎంటీఎస్ అమలు చేయాలని పీఆర్‌టీయూ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్ కోరారు. మంగళవారం కేజీబీవీ కార్యదర్శి డి.దేవానంద్‌కి అమరావతిలో వినతిపత్రం అందించారు. 2016 నుంచి కేజీబీవీల్లో కంప్యూటర్ విద్య నేర్పిస్తున్న సిబ్బంది ఉపాధ్యాయులతో సమానంగా పనిచేస్తున్నప్పటికీ అందుకు అనుగుణంగా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. వారికి బోధనా సిబ్బందితో సమానంగా వేతనాలు ఇవ్వాలని కోరారు. అకౌంటెంట్లను కాంట్రాక్టు విధానంలో నియమించారని, వారిని గత ప్రభుత్వంలో ఔట్‌సోర్సింగ్ విధానంలోకి మార్చారని, తిరిగి వారిని కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలని విన్నవించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589